# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 118

**VEKUVA SAMAYAM TELUGU DAILY**

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: ఆదివారం 17 మే 2026










## మరోసారి పెట్రోల్ ధర పెంపు?

**సమయం ప్రతినిధి:** దేశంలో మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచక తప్పదా? అంటే అవుననే అంటున్నారు ఆర్థికవేత్తలు. ఆయిల్ మార్కెటింగ్ సంస్థల నష్టాలను తగ్గించేందుకు ధరలను మరో రూ.10ల మేర పెంచాల్సి రావొచ్చని అంటున్నారు. ఈ మేరకు ఆర్థిక సేవల సంస్థ ఎమ్‌కే గ్లోబల్ ఒక నివేదికను విడుదల చేసింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. ఫలితంగా దేశీయంగా కూడా ధరలు పెంచకపోతే ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల నష్టాలు మరింత పెరుగుతాయని ఎమ్‌కే గ్లోబల్ సంస్థ పేర్కొంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను సగటున రూ.3 మేర పెంచింది. అంతకుముందే ప్రభుత్వం ఇంధనాలపై ఎక్సైజ్ డ్యూటీలో లీటరుకు రూ.10ల మేర కోత పెట్టింది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల నష్టాలను సగానికైనా తగ్గించుకునేందుకు వచ్చే రెండు మూడు వారాల్లో ధరలను లీటరుకు రూ.10 చొప్పున పెంచే అవకాశం ఉందని అంచనా వేసింది. ఒక్కసారిగా లేక విడతల వారీగా ఇంధన ధరలు రాబోయే రోజుల్లో పెరగవచ్చని తన నివేదికలో అంచనా వేసింది.




## 'ఎన్టీఏను రద్దు చేయాలి'

**న్యూఢిల్లీ, సమయం ప్రతినిధి:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్–యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం మరింత తీవ్రరూపం దాల్చింది. ఎన్‌టీఏను పూర్తిగా రద్దుచేయాలని కోరుతూ యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రస్తుతం సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం, 1860 కింద సేవలందిస్తున్న ఎన్‌టీఏ స్థానంలో పార్లమెంట్ చట్టం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం కలిగిన స్వతంత్ర జాతీయ పరీక్షా సంస్థను ఏర్పాటుచేయాలని పిటిషన్‌లో కోరింది. ఆర్టికల్–32 కింద దాఖలైన ఈ పిటిషన్‌లో నీట్–యూజీ 2026 నిర్వహణలో వ్యవస్థాగత లోపాలు చోటు చేసుకున్నాయని డాక్టర్స్ ఫ్రంట్ ఆరోపించింది. ప్రశ్నపత్రం లీక్ ఘటనతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని, దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిష్పక్షపాతంపై నమ్మకం దెబ్బతిందని పేర్కొంది. ఇప్పటికే ఈ పరీక్ష రద్దుకావడం, మళ్లీ పరీక్ష నిర్వహించేందుకు కేంద్రం నిర్ణయించడంతో ఎన్‌టీఏ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




## వారి నమ్మకం నన్ను అలసిపోనివ్వదు

**ఢిల్లీ, సమయం ప్రతినిధి:** భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది.




## రైతులకు గుడ్ న్యూస్

**సమయం ప్రతినిధి:** దేశవ్యాప్తంగా రైతులు ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాల రాకపై వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. సాధారణంగా మే 26 ప్రాంతంలో కేరళను తాకే నైరుతి రుతుపవనాలు ఈసారి నాలుగు రోజుల ముందుగానో లేదా నాలుగు రోజుల ఆలస్యంగానో కేరళలో ప్రవేశించే అవకాశముందని ఐఎండీ అధికారులు తెలిపారు. ఇప్పటికే రుతుపవనాలు అండమాన్ ప్రాంతంలోకి ప్రవేశించగా, క్రమంగా మరిన్ని ప్రాంతాలకు విస్తరించే పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. వచ్చే మూడు నుంచి నాలుగు రోజుల్లో ఆగ్నేయ అరేబియా సముద్రం, నైరుతి–ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ దీవులు, అండమాన్ సముద్ర ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు మరింత బలపడే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. అలాగే తూర్పు మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లోకి కూడా రుతుపవనాలు విస్తరించే సూచనలు ఉన్నట్లు తెలిపింది. ఇక మరోవైపు పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావం కొనసాగుతూనే ఉంది. దీనికి తోడు ఉత్తర తమిళనాడు ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడటం వల్ల అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ వాతావరణ పరిస్థితుల ప్రభావంతో తమిళనాడులో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉండగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మాత్రం ఎక్కువ ప్రాంతాల్లో పొడి వాతావరణమే కొనసాగనుందని వాతావరణ శాఖ తెలిపింది. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒకటి నుంచి రెండు డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాల్లో మూడు డిగ్రీల వరకు పెరిగే అవకాశముందని హెచ్చరించింది. అయితే అక్కడక్కడ చిరు జల్లులు పడే అవకాశం కూడా ఉందని అధికారులు సూచించారు.




## రాహుల్ గాంధీని కలిశా.. మంత్రి పదవి కోరా..

ఢిల్లీ, **(సమయం ప్రతినిధి):** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని కలిసినట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ కేబినెట్‌లో తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ మేరకు రాహుల్ గాంధీకి వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ కేబినెట్‌లో మూడు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయని.. రంగారెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం లేదని రామ్మోహన్ రెడ్డి చెప్పారు. గతంలో రంగారెడ్డి జిల్లాకు ముగ్గురు నుంచి ఆరుగురు మంత్రులు ఉండేవారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. డీలిమిటేషన్‌లో భాగంగా జిల్లాలో 44 అసెంబ్లీ నియోజకవర్గాలు, 8 పార్లమెంట్ స్థానాలకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కారణంగానే తాను మంత్రి పదవి ఆశిస్తున్నట్లు చెప్పారు. తమ కుటుంబం మూడు తరాలుగా కాంగ్రెస్ పార్టీలోనే పని చేస్తోందని.. బూత్ స్థాయి నుంచి తాను పని చేసినట్లు గుర్తు చేశారు. నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశానని.. పార్టీ అధికారంలోకి రావాలనే ఏకైక లక్ష్యంతో కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి పదవి కోసం రాహుల్ గాంధీకి వినతి సమర్పించగా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తనకు మంత్రి పదవి వచ్చేలా రాహుల్ గాంధీతో మాట్లాడి అవకాశం కల్పిస్తారని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.







# సంపాదకీయం

## జాతి నిర్మాణంలో 'జుగల్బందీ'లు

ఏడు సంవత్సరాల క్రితం (6 ఆగస్టు 2019) ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో నా సహచరులతో పిచ్చాపాటీ చేస్తున్నాను. అంతకు ముందు రోజు పార్లమెంటు, కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన అధికరణ 370ని రద్దు చేయడం గురించి మా సంభాషణ సాగుతోంది. కంప్యూటర్ సైంటిస్ట్ అయిన నా యువమిత్రుడు ఒకరు ఇలా వ్యాఖ్యానించారు: 'ఇప్పుడు మనం చూస్తుంది మోదీ రెండోపాలన ఆరంభం కాదు, అమిత్ షా మొదటి పాలన ప్రారంభం'. భారతదేశపు ఏకైక ముస్లిం మెజారిటీ రాష్ట్రమైన కశ్మీర్ స్థాయిని తగ్గించే పథక రచన, దాని అమలులో ప్రధానపాత్ర వహించింది కొత్త హోం మంత్రి అమిత్ షా అని మరి చెప్పనవసరం లేదు. అధికరణ 370 రద్దు అమిత్ షా పాలన ప్రారంభం అన్న వ్యాఖ్య ఒక అతిశయోక్తే. అయితే షా ఇప్పుడు భారత ప్రభుత్వంలో రెండో అత్యంత శక్తిమంతుడైన నాయకుడు మాత్రమే కాదు, ప్రధానమంత్రి మినహా మరెవరికీ లేని అధికారాలను పూర్తి స్వతంత్రతతో నిర్ణయాత్మకంగా చెలాయిస్తున్న నేత.

మోదీ–షా జుగల్బందీ (ఇరువురి మధ్య అత్యంత సమన్వయంతో కూడిన రాజకీయ భాగస్వామ్యాన్ని సూచించే రూపకాలంకారమది) భారతీయ జనతా పార్టీ చరిత్రలోగానీ, స్వతంత్ర భారతదేశ పాలనా చరిత్రలోగానీ ప్రత్యేకమైనదేమీ కాదు. స్వతంత్ర భారతదేశ తొలి సంవత్సరాలలో జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ్‌భాయ్ పటేల్ మధ్య భాగస్వామ్యాన్నే చూడండి. అది సార్థకమైనది, ఆదర్శప్రాయమైనది. అయితే వర్తమాన రాజకీయాల తర్కవితర్కాలు ఆ శిఖర సమానులను ప్రత్యర్థులుగా, పరస్పర శత్రువులుగా చిత్రిస్తున్నాయి. నిజానికి వారిరువురూ నిస్వార్థ స్నేహితులు, సన్నిహిత సహచరులు. దేశ విభజన కల్లోలంలో వారిరువురు అధికార స్వార్థాలకు తావివ్వకుండా తమ తమ విధ్యుక్త ధర్మాలను కలసికట్టుగా నిర్వహించి ఉండకపోతే సమైక్య, ప్రజాస్వామిక భారత గణతంత్ర రాజ్యం ఆవిర్భవించి వర్ధిల్లేదే కాదు. పటేల్ తన అసాధారణ రాజనీతిజ్ఞత, కార్యదక్షతతో భారతదేశాన్ని భౌగోళికంగా సమైక్యపరిచి, పరిపాలనా వ్యవస్థను ఆధునికీకరించారు. హిందూ మితవాదులను, వామపక్షీయులను నియంత్రించారు. డాక్టర్ అంబేడ్కర్ నిర్దేశకత్వంలో ఆరంభమైన రాజ్యాంగ నిర్మాణ ప్రక్రియకు కాంగ్రెస్ నుంచి పరిపూర్ణ, ఫలప్రదమైన మద్దతు లభించేలా చూశారు. అదే సమయంలో లౌకిక ప్రజాస్వామ్య సమాజంగా భారతదేశాన్ని తీర్చిదిద్దడంలో జవహర్‌లాల్ నెహ్రూ కీలకపాత్ర వహించారు. సమ్మిళిత పౌరసత్వాన్ని ప్రోత్సహించడం, మైనారిటీలకు సమాన హక్కులు కల్పించడం, జెండర్ సమానత్వాన్ని సమర్థించడం, సకల అంతరాలకు అతీతంగా వయోజన ఓటు హక్కు కల్పించడం మొదలైన ప్రగతిశీల కృషితో ఆసేతు హిమాచలం సమస్త భారతీయులలో భావోద్వేగ సమైక్యతను నిర్మించి పెంపొందించారు. పలు విషయాలలో నెహ్రూ, పటేల్ మధ్య విభేదాలు ఉన్నాయి. అయితే విశాల జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆ విభేదాలను విస్మరించి వారు కలసికట్టుగా కృషి చేశారు. డాక్టర్ అంబేడ్కర్, ఇతర నాయకులు, సమర్థులైన సివిల్ సర్వెంట్ల సహాయ సహకారాలు వారికి నిస్వార్థంగా లభించేవి. నవభారత నిర్మాణంలో నెహ్రూ–పటేల్ భాగస్వామ్యం కీలకమైన, నిర్ణయాత్మకమైన పాత్ర వహించిందని చరిత్రకారులు ధ్రువీకరించారు.

1960వ దశకంలో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ తన ముఖ్య కార్యదర్శిగా మాజీ దౌత్యవేత్త పి.ఎన్.హక్సర్‌ను నియమించడంతో దేశ పాలనను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసిన రెండవ భాగస్వామ్యం ప్రభవించింది. ఇందిర కేబినెట్ మంత్రులలో మహాశక్తిమంతుడుగా హక్సర్ అతి కొద్ది కాలంలోనే పరిణమించారు. ఇందిరకు కుడి భుజంగా, ప్రభావశీల సలహాదారుగా ఆయన పేరు పొందారు. ఇందిరాగాంధీకి అజరామర కీర్తిప్రతిష్ఠలు సమకూర్చిన బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం విజయంలో హక్సర్ కీలకపాత్ర నిర్వహించారు. వ్యవసాయం, అంతరిక్ష రంగాలలో ఉత్కృష్టమైన పరిశోధనలను ప్రోత్సహించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిని దెబ్బతీసిన ఇందిర ఆర్థిక విధానాల నిర్ణేత కూడా హక్సరే. 1975లో ప్రధాని ఇందిర తన రెండవ కుమారుడు సంజయ్‌గాంధీకి ప్రాధాన్యమిస్తూ హక్సర్‌ను తొలుత దూరంపెట్టి, ఆ తరువాత పూర్తిగా ఉపేక్షించారు. ఇలా మొదలైన ఇందిర–సంజయ్ భాగస్వామ్యం భారత్ నిరంకుశ పాలనలోకి జారిపోవడానికి కారణమయింది. పౌర స్వేచ్ఛల అణచివేత జరిగింది. పత్రికా స్వాతంత్ర్యం హరించింది. న్యాయవ్యవస్థను ప్రభుత్వానికి అనుకూలంగా నియంత్రించారు. పౌర, పోలీసు అధికారులు తల్లీతనయులకు పూర్తిగా విధేయులు అవడం అనివార్యమయింది. ఇందిర–హక్సర్ భాగస్వామ్యం వలే ఇందిర–సంజయ్ భాగస్వామ్యం జాతి శ్రేయస్సుకు దోహదం చేసిన సార్థక విజయాలను సాధించలేదు.

దేశ పాలనలో తదుపరి ప్రముఖ భాగస్వామ్యం ప్రధానమంత్రి పీవీ నరసింహారావు, ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్‌ది. 1991–96 సంవత్సరాల మధ్య ఈ నాయకద్వయం దేశ ఆర్థిక వ్యవస్థను లైసెన్స్–పర్మిట్–కోటా రాజ్ నుంచి విముక్తం చేశారు. దేశ ప్రజల ఆర్థిక, వ్యవస్థాపనా సామర్థ్యాలకు ఊపిరులు పోశారు. పీవీ–మన్మోహన్ భాగస్వామ్యం దేశ ప్రజల పేదరికాన్ని తగ్గించింది. మధ్యతరగతి ప్రజల సమున్నతికి తోడ్పడింది. ప్రపంచంలో దేశ ప్రతిష్ఠను ఇతోధికంగా పెంపొందించింది.

పీవీ–మన్మోహన్ అనంతరం అటల్‌బిహారీ వాజపేయి–లాల్‌కృష్ణ ఆడ్వాణీ రాజకీయ భాగస్వామ్యం రంగంలోకి వచ్చింది. కాంగ్రెస్‌కు ప్రధాన సవాల్‌దారుగా బీజేపీని నిలబెట్టేందుకు 1980లు, 1990ల్లో ఈ నాయకద్వయం కలిసికట్టుగా కృషిచేసింది. 1998–2004 సంవత్సరాల మధ్య బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు వాజపేయి ప్రధానమంత్రి, ఆడ్వాణీ హోం మంత్రి. పీవీ––మన్మోహన్‌ల ఆర్థిక సంస్కరణలను వీరు కొనసాగించారు. ఈ కృషిలో వాజపేయి––ఆడ్వాణీకి జస్వంత్‌సింగ్, యశ్వంత్‌సింగ్ మొదలైన సమర్థనేతల సహకారం లభించింది. అయితే బీజేపీ ప్రభుత్వం బహుళ పార్టీల సంకీర్ణం కావడంతో సంఘ్ పరివార్ ఆధిపత్యవాద ధోరణులు పాలనలో ప్రాబల్యం వహించేందుకు ఆస్కారం లేకపోయింది.

# నీట్ లీక్ ఎఫెక్ట్... అన్ని పరీక్షలపై ప్రభావం

హైదరాబాద్ : నీట్ కౌన్సెలింగ్ తర్వాతే పలు ఇతర కోర్సుల ప్రవేశాలు జరపాల్సి ఉండటంతో యేటా విద్యా సంవత్సరం గాడి తప్పుతోంది. ఈ క్రమంలో ఈఏపీసెట్ ఫలితాలు మే నెలలోనే వెలువడినా ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు అక్టోబరు వరకు వేచి చూడాల్సి వస్తోంది. అన్ని పరీక్షలు సకాలంలో పూర్తయితేనే ఈఏపీసెట్ పరిస్థితి ఇలా ఉంది. ఇక ఈ ఏడాది నీట్ పరీక్ష రద్దు అవడంతో పలు ప్రవేశాల ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది మే 4న నీట్ నిర్వహించగా.. జూన్ 14న ఫలితాలు వచ్చాయి. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఆయా నీట్ ర్యాంకు ఆధారంగా రాష్ట్ర ర్యాంకు కేటాయిస్తారు. ఆ తర్వాత కౌన్సెలింగ్ మొదలవుతుంది. రాష్ట్ర నీట్ కౌన్సెలింగ్ రెండు, మూడు దఫాలు పూర్తయిన తర్వాత ఈఏపీసెట్ అగ్రికల్చర్ విభాగం ప్రవేశాలు మొదలుపెడుతుంది. కాళోజీ హెల్త్ వర్సిటీల ఆధ్వర్యంలో తొలుత నీట్ కౌన్సెలింగ్ ఆ తర్వాత వెటర్నరీ, అగ్రికల్చర్, హార్టికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలు జరుపుతారు. చివరగా బీఫార్మసీ, ఫార్మా–డి కౌన్సెలింగ్ మొదలవుతుంది. గత ఏడాది నీట్ సవ్యంగా జరిగితేనే ఫార్మా కౌన్సెలింగ్ అక్టోబరు 5న మొదలైంది. చివరి విడత కౌన్సెలింగ్ అక్టోబరు 23తో పూర్తయింది. ఈ సారి నీట్ రద్దు కావడంతో ఈ ప్రవేశాలు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఇక బీ ఫార్మసీ, ఫార్మా–డి కోర్సులకైతే నవంబరు వరకు ప్రవేశాలకు ఎదురు చూడాల్సిందే. ఈ కౌన్సెలింగ్‌లు అన్నీ ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉండటంతోనే ఈ జాప్యం నెలకొంటుంది. ఒక కోర్సులో చేరిన తర్వాత డిమాండ్ ఉన్న మరో కోర్సులో సీటు వస్తే.. తొలుత సీటు పొందిన కాలేజీలు ఫీజు, సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వడం లేదు. దీంతో ఆ ఫీజును వదులు కోవడమో.. మెరుగైన సీటు కోల్పోవడమో జరుగుతుంది. అందుకే విద్యాశాఖ అధికారులు సైతం ఒక కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత మరొకటి నిర్వహిస్తున్నారు. ఈసారి మళ్లీ నీట్ నిర్వహించి, ఫలితాలు వెల్లడించడానికి కనీసం 2 నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఆ ప్రకారంగా చూస్తే ప్రవేశాల కౌన్సెలింగ్‌లు మరింత ఆలస్యమవుతాయి. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటే తప్ప కొత్త విద్యాసంవత్సరం కొలిక్కిరాదని నిపుణులు భావిస్తున్నారు.

# తెలంగాణలో సర్ చిచ్చు

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' చిచ్చు రేపుతోంది. ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రక్రియ ఇప్పుడు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీల మధ్య యుద్ధానికి దారితీసింది. అయితే, ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ వహిస్తున్న మౌనం రాజకీయ వర్గాల్లో పెను చర్చకు దారితీస్తోంది. ఓటరు జాబితాలో బోగస్ ఓట్లు, డూప్లికేట్ ఎంట్రీలను తొలగించడమే 'సర్' లక్ష్యమని కేంద్రం చెబుతున్నా, బీజేపీయేతర పార్టీలు మాత్రం దీనిని ఒక రాజకీయ ఆయుధంగా చూస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ తీవ్ర వివాదాలకు కేంద్ర బిందువైంది. పశ్చిమ బెంగాల్లో లక్షలాది మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ముఖ్యంగా అక్రమ వలసదారుల పేరుతో మైనార్టీ వర్గాల ఓట్లు గల్లంతు చేశారని, తద్వారా బీజేపీ లబ్ధి పొందిందనే వాదన బలంగా వినిపించింది. బీహార్ లో కూడా ఆర్‌జేడీ, కాంగ్రెస్ వంటి పార్టీలు సర్ విధానాన్ని వ్యతిరేకించాయి. పారదర్శకత లేని తొలగింపులు ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని విమర్శించాయి. ఈ రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు వీధుల్లోకి వచ్చి పోరాడితే, తెలంగాణలో పరిస్థితి భిన్నంగా ఉంది. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ను కలిసి సాఎఖీపై తన అభ్యంతరాలను వ్యక్తం చేసింది. పౌరసత్వ చట్టాన్ని సాకుగా చూపి మైనార్టీల ఓట్లను తొలగించవద్దని, 14 రకాల గుర్తింపు కార్డుల్లో దేనిని చూపించినా ఓటరుగా గుర్తించాలని కోరింది. నిజామాబాద్, భైంసా, బోధన్ వంటి ప్రాంతాల్లో మైనార్టీ ఓట్లు ఎక్కువగా ఉండటంతో, అక్కడ 'సర్' ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది. దేశవ్యాప్తంగా బీజేపీయేతర పక్షాలు 'సర్'పై గళమెత్తుతుంటే, బీఆర్ఎస్ మాత్రం ప్రేక్షక పాత్రకు పరిమితమైంది. దీని వెనుక బలమైన రాజకీయ లెక్కలు ఉన్నట్లు కనిపిస్తున్నాయి. మైనార్టీల ఓట్ల కోసం 'సర్'ను వ్యతిరేకిస్తే, మెజారిటీ హిందూ ఓటర్లలో వ్యతిరేకత వస్తుందని కేసీఆర్ భావిస్తున్నారనే సందేహం కలుగుతోంది. ఇప్పటికే మైనార్టీలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో, ఇప్పుడు వారి కోసం పోరాడి ఉన్న హిందూ ఓట్లను పోగొట్టుకోవడం ఎందుకని బీఆర్ఎస్ భావిస్తుండవచ్చు. ఇటీవల ప్రధాని మోడీ పర్యటనపై కూడా బీఆర్ఎస్ పెద్దగా స్పందించలేదు. 'సర్' వంటి విధానపరమైన అంశాల్లో బీజేపీని విమర్శించకపోవడం ద్వారా, కేంద్రంతో సన్నిహితంగా ఉండాలని చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పాతబస్తీ వంటి చోట్ల ఎంఐఎం బలంగా ఉంది. అక్కడ ఓట్లు తొలగించినా ఎంఐఎంకే నష్టం తప్ప తమకేమీ కాదనే ధీమా కూడా బీఆర్ఎస్‌లో ఉండవచ్చు. ఒకవైపు కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి ఎన్నికల సంఘం చుట్టూ తిరుగుతోంది. ఎంఐఎం తనదైన శైలిలో పోరాటానికి సిద్ధమవుతోంది. కానీ, రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ వంటి పార్టీ, ఇంతటి కీలకమైన అంశంపై నోరు విప్పకపోవడం ప్రజాస్వామ్యవాదులను విస్మయానికి గురిచేస్తోంది. ఓటర్ల తొలగింపు ప్రక్రియ పూర్తయ్యాక, తుది జాబితా వచ్చాక కూడా బీఆర్ఎస్ ఇదే మౌనాన్ని కొనసాగిస్తే.. ఆ పార్టీ కేవలం రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల ఓటు హక్కుపై ఆసక్తి లేదని స్పష్టమవుతుంది. బీఆర్ఎస్ మౌనం.. బీజేపీకి పరోక్షంగా సహకరించడమే అవుతుందనే విమర్శలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆ పార్టీ నాయకత్వంపై ఉంది. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో 'సర్' చుట్టూ జరుగుతున్న ఈ లొల్లి, రాబోయే ఎన్నికల ముఖచిత్రాన్ని మార్చేలా కనిపిస్తోంది.

# గన్ వదిలి పెన్ పట్టి...

కరీంనగర్ : మాజీ మావోయిస్టు దేవ్‌జీ దాదాపు 40 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా మారి ఇంటర్మీడియట్ పరీక్ష రాశారు. 1983లో పోలీసుల జోక్యానికి నిరసనగా ఇంటర్ పరీక్షలకు దూరమైన ఆయన.. ఇప్పుడు సామాన్య పౌర జీవితంలో భాగంగా చదువును పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్లలోని పరీక్షా కేంద్రంలో తెలుగు పేపర్ రాసిన దేవ్‌జీ.. భవిష్యత్తులో న్యాయవాదిగా మారి పేదల తరపున పోరాడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాలం మారింది.. మార్గమూ మారింది.. కానీ లక్ష్యం మాత్రం సమాజ హితమే అని చాటిచెబుతున్నారు మాజీ మావోయిస్టు నేత దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి. ఒకప్పుడు గన్ చేతబట్టి అడవి బాట పట్టిన ఈ మాజీ మావోయిస్టు ఇప్పుడు తన అసంపూర్ణ విద్యను పూర్తి చేసేందుకు పెన్ను పట్టారు. సరిగ్గా 40 ఏళ్ల క్రితం ఎక్కడైతే తన చదువు ఆగిపోయిందో.. మళ్లీ అక్కడి నుంచే తన కొత్త అధ్యాయాన్ని ప్రారంభించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన దేవ్‌జీ.. 1982–83 ప్రాంతంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివారు. ఆ సమయంలో విప్లవ భావజాలానికి ఆకర్షితుడై రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో చురుగ్గా పనిచేశారు. ఆ క్రమంలో ఆయనపై పలు కేసులు నమోదు కావడంతో చదువుకు ఆటంకం ఏర్పడింది. ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు రాసినప్పటికీ.. తెలుగు సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారు. మిగిలిన అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించినా.. విప్లవ పోరాటంలో భాగంగా అజ్ఞాతంలోకి వెళ్లడంతో మళ్లీ పరీక్ష రాసే అవకాశం చిక్కలేదు. సుదీర్ఘకాలం ఉద్యమంలో కొనసాగి ఇటీవలే జనజీవన స్రవంతిలోకి వచ్చిన దేవ్‌జీ.. తన విద్యను పూర్తి చేయాలని గట్టిగా నిశ్చయించుకున్నారు. ఇంటర్ బోర్డు నుంచి ప్రత్యేక అనుమతి పొంది బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్లలోని ఒక ప్రైవేట్ జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రానికి హాల్ టికెట్, ఎగ్జామ్ ప్యాడ్‌తో చేరుకున్నారు. తన కన్నా వయసులో చాలా చిన్నవారైన విద్యార్థులతో కలిసి ఏమాత్రం సంకోచించకుండా తెలుగు పరీక్ష రాశారు. పరీక్ష అనంతరం దేవ్‌జీ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఉద్యమంలోకి వెళ్లినప్పుడు తన చదువు ఎక్కడ ఆగిందో.. అక్కడి నుంచే మళ్లీ మొదలు పెట్టాలని అనుకున్నానని చెప్పారు. ఇంటర్ పూర్తి చేసిన తర్వాత లాసెట్ రాసి న్యాయ విద్యను అభ్యసించాలనుకుంటున్నట్లు వెల్లడించారు. న్యాయవాదిగా మారి సమాజంలోని పేదలకు ఉచితంగా న్యాయ సాయం అందించడమే తన తుది లక్ష్యమని అన్నారు. ఒకప్పటి విప్లవ నేత ఇలా విద్యామార్గంలో ప్రజాసేవకు సిద్ధమవ్వడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. కాగా, గత ఏడాది కాలంలో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు చాలా మంది పోలీసుల ఎదుట లొంగిపోయారు. దేవ్ జీ తో పాటు మల్లా రాజిరెడ్డి, ఆశన్న వంటి కీలక నేతలు పలు విడతల్లో పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారు. ఆ తర్వాత జన జీవన స్రవంతిలో కలిసిపోయి సాధారణ పౌర జీవితం గడుపుతున్నారు. అందులో భాగంగానే తాజాగా.. దేవ్ జీ ఆగిపోయిన తన చదువును కొనసాగించేందుకు ఇంటర్ పరీక్షలు రాశారు.

# గులాబీ మిషన్ 2028

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మరోసారి గులాబీ జెండా రెపరెపలాడించేందుకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు సమర శంఖం పూరించారు. పార్టీ ఓటమి అనంతరం కొంతకాలం స్తబ్దుగా ఉన్న గులాబీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపేందుకు మంగళవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో కేసీఆర్ కీలక భేటీ నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు సహా 23 మంది ముఖ్య నేతలతో సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశం, కేవలం ఒక సమీక్షగా కాకుండా, రాబోయే నాలుగేళ్ల ప్రయాణానికి దిక్సూచిగా నిలిచింది. కేసీఆర్ తీసుకున్న అత్యంత కీలక నిర్ణయం డిజిటల్ సభ్యత్వ నమోదు. గతంలో అనుసరించిన సంప్రదాయ సభ్యత్వ పద్ధతులకు స్వస్తి పలికి, పూర్తిస్థాయిలో సాంకేతికతను జోడించి సభ్యత్వాలను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలో బూత్ స్థాయి నుంచి సభ్యుల సమాచారాన్ని డిజిటలైజ్ చేస్తారు. దీనివల్ల క్షేత్రస్థాయి కార్యకర్తకు, పార్టీ అధిష్టానానికి మధ్య మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంబంధం ఏర్పడుతుంది. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సమన్వయకర్తలను నియమించి, పార్టీ కార్యకలాపాల్లో పారదర్శకతను పెంచనున్నారు. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కేసీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. రైతు రుణమాఫీలో జాప్యం, ధరణి పోర్టల్ సమస్యలు, నిరుద్యోగ భృతి వంటి హామీల వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. గతంలో నిర్వహించిన భారీ బహిరంగ సభల కంటే, ఈసారి ప్రజలతో నేరుగా మమేకమయ్యేలా 'జన చైతన్య యాత్రల'కు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. గ్రామాల వారీగా తిరుగుతూ, ప్రజల సమస్యలపై పోరాడటం ద్వారానే పూర్వ వైభవం సాధ్యమవుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు. పదేళ్ల అధికార కాలంలో నాయకులకు, సాధారణ కార్యకర్తలకు మధ్య ఏర్పడిన దూరాన్ని గుర్తించిన కేసీఆర్, పార్టీ నిర్మాణంలో భారీ మార్పులు సూచించారు. కేవలం నాయకుల చుట్టూ తిరిగే పార్టీగా కాకుండా, క్షేత్రస్థాయి కార్యకర్తలే నిర్ణయాత్మక శక్తిగా ఉండేలా క్యాడర్ డ్రివెన్ వ్యవస్థగా బీఆర్ఎస్ రూపాంతరం చెందబోతోంది. ప్రతి కార్యకర్తకు రాజకీయ భద్రత కల్పించడంతో పాటు, కష్టకాలంలో పార్టీ కుటుంబంలా అండగా ఉంటుందనే భరోసా ఇచ్చేలా సంస్థాగత రక్షణ వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. బీఆర్ఎస్ పునర్నిర్మాణం కేవలం కమిటీల మార్పుకే పరిమితం కాదని, తెలంగాణ అస్తిత్వాన్ని, అభివృద్ధిని మళ్లీ చర్చలోకి తెచ్చే ప్రయత్నమని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. 'రీక్లెయిమింగ్ తెలంగాణ' అనే నినాదంతో, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా బీఆర్ఎస్‌ను మళ్ళీ నిలబెట్టాలని కేసీఆర్ సంకల్పించారు. మొత్తంగా, ఎర్రవెల్లి భేటీ బీఆర్ఎస్ పార్టీలో నిస్తేజాన్ని వదిలించుకుని ఒక శక్తివంతమైన ప్రతిపక్షంగా అసెంబ్లీలోనూ, వీధుల్లోనూ పోరాడేందుకు అవసరమైన పక్కా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. రాబోయే రెండేళ్ల కాలానికి కేసీఆర్ నిర్దేశించిన ఈ రోడ్ మ్యాప్ తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి





**వైభవంగా విద్యా వారోత్సవాలు,**
**విద్యా వారోత్సవాల్లో మెరిసిన విద్యార్థుల ప్రతిభ**
**గ్రామీణ విద్యార్థుల్లో అపార ప్రతిభ ఉంది**
**ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు,**
**బహుమతులు అందజేసిన**
**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్ ప్రతినిధి:** విద్యార్థులు పాఠ్యపుస్తకాలలోని విషయాలను మాత్రమే నేర్చుకోవడం సరిపోదని, జీవితంలో విజయవంతం కావాలంటే ఇతర రంగాల్లో కూడా చురుకుగా పాల్గొనాల్సిన అవసరం ఉందని, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, వేదికపై మాట్లాడే ధైర్యం మరియు కళాత్మక ప్రతిభను పెంపొందిస్తాయని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాలను విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అత్యంత వైభవంగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యా ప్రదర్శనలు, ప్రతిభా ప్రదర్శనలతో సభా ప్రాంగణం ఉత్సాహభరిత వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు స్వాగత నృత్యాలు, జానపద కళారూపాలు, దేశభక్తి గీతాలు, సామాజిక సందేశాలతో కూడిన నాటికలను ప్రదర్శించి అతిథులను అలరించారు. విద్యార్థులు రూపొందించిన టిఎల్ఎం ను తిలకించి, విద్యార్థుల ప్రతిభను చూసి జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సాంస్కృతిక, క్రీడా, సృజనాత్మక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి విద్యా వారోత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని, భవిష్యత్ సమాజ నిర్మాణంలో విద్యార్థులే ప్రధాన శక్తిగా నిలుస్తారని, అందుకే వారిలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలు అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. డిజిటల్ విద్య, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, మౌలిక వసతుల అభివృద్ధి, ఆంగ్ల మాధ్యమ బోధన వంటి చర్యల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారిని ఉన్నత లక్ష్యాల దిశగా నడిపించాలని సూచించారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం విద్యతో పాటు నైతిక విలువలు కూడా ఎంతో అవసరమని కలెక్టర్ అన్నారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని కృషి చేస్తే తప్పకుండా విజయం సాధించగలడని ప్రోత్సహించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి ఎదగగల సామర్థ్యం కలిగి ఉన్నారని, వారికి సరైన మార్గదర్శకత్వం లభిస్తే దేశానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. విద్యా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, సైన్స్ ప్రదర్శనలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు, మెడల్స్, బహుమతులు అందజేశారు. బహుమతులు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్, నోడల్ అధికారి కురుమయ్య, సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, నూరుద్దీన్, వెంకటయ్య మురళీధర్ రెడ్డి శోభారాణి, షర్ఫుద్దీన్, ఎస్ జి ఎఫ్ కార్యదర్శి నాగేశ్వర్ రావు, వివిధ మండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ఇతర అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణపై చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించాలి : అదనపు ఎస్పీ రాజేష్ మీనా



**చెక్‌పోస్టుల వద్ద 24 గంటల అప్రమత్తంగా ఉండాలి**
**పెబ్బేరు పశువుల సంత, పోలీస్ చెక్‌పోస్ట్ తనిఖీ**
**వెటర్నరీ అనుమతి పత్రాలు తప్పనిసరిగా పరిశీలించాలి**

**(సమయం ప్రతినిధి వనపర్తి) :** జిల్లా నుండి ఎట్టి పరిస్థితుల్లోనూ పశువుల అక్రమ రవాణా జరగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా అదనపు ఎస్పీ లిరాజేష్ మీనా, అన్నారు . పశువుల అక్రమ రవాణాను అరికట్టడంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. శనివారం రోజు అదనపు ఎస్పీ రాజేష్ మీనా, వనపర్తి జిల్లా పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టణ కేంద్రంలో ప్రతి శనివారం భారీ స్థాయిలో నిర్వహించే పశువుల సంతను ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం జాతీయ రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసి అక్కడి భద్రతా ఏర్పాట్లు, విధుల నిర్వహణ తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. పశువుల రవాణా చేసే వ్యక్తుల వద్ద తప్పనిసరిగా వెటర్నరీ అధికారుల అనుమతి పత్రాలు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహించే సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, ఎవరు కూడా విధుల్లో అలసత్వం ప్రదర్శించరాదని హెచ్చరించారు. తనిఖీ చేసిన ప్రతి వాహనం వివరాలను రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా చెక్‌పోస్ట్ విధుల్లో ఉన్న సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను ఆదేశించారు. ప్రజల సహకారంతోనే పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టగలమని, అనుమానాస్పద వాహనాలు లేదా అక్రమ రవాణా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అదనపు ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట సీఐ రాంబాబు, పెబ్బేరు ఎస్సై వెంకటేష్ గౌడ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో గంటకు 10 వేల మంది దర్శనం

తిరుమల : కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం ఇప్పుడు సులభతరంగా మారింది. టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు చేపట్టిన సరికొత్త చర్యల వల్ల వేలాది మంది భక్తులకు ఇప్పుడు కేవలం గంటల వ్యవధిలోనే స్వామి వారి దర్శన భాగ్యం కలుగుతోంది. వెరసి గతంలో గంటల తరబడి క్యూ లైన్లలో నిలవాల్సిన పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదు. అదే సమయంలో దూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు విడిది సౌకర్యం లభ్యత కూడా బాగా పెరిగింది. ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అందుబాటులోకి తెచ్చిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) వ్యవస్థ దోహదం చేస్తోందని చెప్పాలి. ఈ నెల 2న తిరుమల వెంకన్నను 91 వేల మంది దాకా దర్శనం చేసుకున్నారు. వీరందరికీ కేవలం 12 గంటల్లోనే స్వామి వారి దర్శనం కల్పించిన టీటీడీ సత్తా చాటింది.

## మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన బండి భగీరథను అరెస్టు చేయాలని అంబేద్కర్ విగ్రహం ముందు మాస్ లైన్ నిరసన



**(సమయం ప్రతినిధి అమరచింత) :** అమరచింత మండల కేంద్రంలో మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా అంబేద్కర్ విగ్రహం ముందు శనివారం నాడు నిరసన ను చేపట్టింది. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శి ప్రసాద్ డివిజన్ నాయకులు కే రాజన్న పట్టణ కార్యదర్శి మస్ల మని మాట్లాడుతూ దేశంలో రాష్ట్రం లో మహిళలపై నిత్యం అఘాయిత్యాలు జరుగుతున్నా ప్రభుత్వాలు వీటిని అరికట్టడంలో విఫలం ఇవ్వడమే కాకుండా ఉన్నోడిదే చట్టం అన్న చందంగా ఉన్నవాడు ఏమి చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో సాయి బండి భగీరథ మైనర్ బాలిక పై చేసిన లైంగిక దాడి సమాజానికంతటికి తెలిసినప్పటికీ ప్రభుత్వాలు అధికారులు బండి భగీరథు ని అరెస్ట్ చేయడంలో జాప్యం జరు గుతున్నది దీనికంతటికి కారణం భగీరథకు బిజెపి పార్టీ రాజకీయ పలుకు బడి ఉండడమే మరియు ధనవంతులకు, పేదలకు, తేడాల వల్ల ఇది జరుగుతుందని మేము భావిస్తున్నాం దేశంలో రాష్ట్రంలో జరిగే అగైత్యాలను ప్రభుత్వాలు అరికట్టడంలో చొరవ తీసుకోవాలని ప్రజలకు రక్షణగా ఉండాలని కోరుతున్నాం ఈ లైంగిక దాడిలో పాల్గొన్న బండి భగీరథను వెంటనే అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అమరచింత మండల కేంద్రంలో మెయిన్ రోడ్డుపై అదే విధంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలియజేస్తూ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పట్టణ కమిటీ నాయకులు,కురుమన్న జిలాని భక్తి,విజయ్ తాజుద్దీన్ గీత భాయ్ రామ్ చందర్ రామచందర్ జి, భీమన్న, రంగన్న శీను తదితరులు పాల్గొన్నారు.

## దువ్వాడ లెక్క ఏంటీ

శ్రీకాకుళం : పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టుగా కొందరు నాయకులు రాజకీయాల్లో వేసే వేషాలు.. అంతగా సక్సెస్ కావన్నది అందరికీ తెలిసిందే. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు పరిస్థితి కూడా ఇలానే ఉంది. వచ్చే ఎన్నికల్లో తనకు టికెట్ ఇవ్వకపోతే.. స్వతంత్రంగానే పోటీ చేస్తానని.. గెలిచి తీరుతానని చెబుతున్నారు. నిజానికి ఇలాంటి ప్రకటనలు చేయడం చాలా తేలిక. కానీ.. నిరూపించుకోవడం, సాధించడం మాత్రం అంత తేలికకాదు. ఒకప్పుడు ఒంటరిగా పోరాటం చేసేందుకు నాయకులు పెద్దగా వెనుకాడాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. బలమైన పార్టీల హవా.. ప్రభుత్వాల దూకుడు వంటివి ఎక్కువగా పనిచేస్తున్నాయి. అంతేకాదు, పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను.. వారి గ్రాఫ్‌నుకూడా ప్రజలు తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వచ్చిన తర్వాత అభ్యర్థుల వ్యవహార శైలి కూడా పెద్ద ఎత్తున చర్చకు వస్తోంది. ఇది వ్యక్తిగత అంశాల వరకు కూడా ప్రభావితం అవుతోంది. దువ్వాడ శ్రీనివాస్ వ్యక్తిగత ఇమేజ్ ఇబ్బందుల్లో ఉందనే చెప్పాలి. కుటుంబాన్ని ఆయన దూరం పెట్టి.. సహజీవనం చేస్తున్న వైనం.. సొంత అనుచరుల మధ్యే చర్చకు వస్తోంది. ఇక, నియోజకవర్గం రాజకీయంగా ఇది వివాదం అయ్యే అవకాశం ఉంటుంది. అంతేకాదు.. దువ్వాడకు ఉన్న వ్యక్తిగత ఇమేజ్ కూడా పెద్దగా కనిపించడం లేదు. నియోజకవర్గంలో ప్రజలకు ఏమైనా సేవ చేసి ఉంటే.. దానిని చెప్పుకొనేందుకు అవకాశం ఉండేది.

## పెట్రోల్ డీజిల్ ధరలపై అమరచింతలో సిపిఎం నిరసన



**(సమయం ప్రతినిధి అమరచింత) :** పెంచిన పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలను తగ్గించాలని అమరచింత లో శనివారం నాడు సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండలకార్యదర్శి వర్గ సభ్యులు యస్. అజయ్. టి.రాఘవేంద్ర లు ప్రసంగిస్తున్న. 14న అర్ధరాత్రి ప్రజలు నిద్రించిన తర్వాత పెట్రోల్ డీజిల్ ధరలను 3చొప్పున పెంచడం దారుణమని విమర్శించారు. 5రాష్ట్ర ల ఎన్నికల ముందు రేట్లు పెంచాబొమని ప్రగల్బాలు పలికిన బిజెపి కేంద్రం మంత్రులు కిషన్ రెడ్డి బండి సంజయ్ లు ఇప్పుడు నోరు మెదపదం లేదని ఏద్దేవా చెశారు. ఇటీవల కమర్శియల్ సిలిండర్ 993కు పెంచడం తో 3000కు పెరిగిందని దింతో చిరు వ్యాపారుల నుండి పెద్ద పెద్ద హోటల్లు మూత బడ్డాయాని విమర్శించారు. మధ్యాహ్నం భోజనం గురుకులాల్లో సిలిండర్ల కొరతతో కట్టెల పొయ్యిలతోవంటలు వండే దుస్థితికి బిజెపి కారణం అని అన్నారు. రాబోయే రోజుల్లో పెట్రోల్ డీజిల్ సిలిండర్ ధరలను ఇంకా భారీగా పెంచే ప్రమాదం ఉందని హెచ్చరించారు..ఇప్పటికైనా బిజెపి చేస్తున్న కుటిల రాజకీయలను ప్రజలు గమనిశీచి రానున్న రోజుల్లో ఉద్యమల ద్వారా బిజెపి కి తగిన బుద్ది చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమం లో సిపిఎం మండలనాయకులు బుచ్చన్న శ్యామ్ సుందర్. బేక్కేశీ విష్ణు. సాగర్. విజయ్.కె. రవిప్రకాష్. అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకులు పాదయాత్ర కాదు, పొర్లు దండాల యాత్ర చేసిన ప్రజలు నమ్మే పరిస్థితి లేదు : జిల్లా ఎమ్మెల్యేల విమర్శలు

(సమయం ప్రతినిధి, హైదరాబాద్) : అసెంబ్లీలోని సీఎల్పీ కార్యాలయంలో శుక్రవారం నాడు పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుపై బిఆర్ఎస్ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు చేసిన దుష్ప్రచారన్ని ఖండిస్తూ, శనివారం నాడు మహబూబ్ నగర్, దేవరకద్ర, వనపర్తి, నాగర్ కర్నూల్ తదితర పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు, విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జియం ఆర్, వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి మహబూబ్నగర్ ఎమ్మెల్యే ఎన్ ఎం శ్రీనివాస్ రెడ్డి లు మాట్లాడుతూ ఎదైనా అకేషన్ లో బిఆర్ఎస్ నాయకులు కలుసుకున్నప్పుడు సరదాగా ఓ ప్రెస్ మీట్ పెడతారు.నిన్నటి సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ఇరిగేషన్, వరి కొనుగోళ్లు, జిల్లాకు ముఖ్యమంత్రి ఏమి చేశారంటూ మాట్లాడారు.

బిఆర్ఎస్ నాయకులు పదే, పదే మాట్లాడుతున్న పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు బీజశీ వేసిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు.

ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం జూరాల సోర్స్ గా, పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు రూపకల్పన చేసిందని 10, జూన్ , 2015 నాడు పాలమూరు ప్రాజెక్టుకు జూరాల సోర్స్ ను మార్చి, శ్రీశైలం సోర్స్ కరెక్ట్ అని బిఆర్ఎస్ ప్రభుత్వం జీవో నెంబర్ 105 తీసుకువచ్చింది.జూన్ 11 2015 నాడు పాలమూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి కరివేన వద్ద పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు కేసీఆర్ శంకుస్థాపన చేశారన్నారు.

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును మూడు సంవత్సరాలలో పూర్తి చేసి, జిల్లా ప్రజలకు నీరు అందిస్తామని కేసీఆర్ తెలియ చేస్తూ, ఇక్కడ ఒక గెస్ట్ హౌస్ కట్టించండి, ఇక్కడ కుర్చీ వేసుకుని ప్రాజెక్ట్ పూర్తి చేయిస్తానని ప్రకటించారు.

2023 నవంబర్ నాటికి కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు, ఆ సమయంలో ఒక్క నాడు కూడా కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి పై రివ్యూ నిర్వహించలేదు.జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయాలని ఏ ఒక్క రోజు కెసిఆర్ ను అడగలేదు, కేసీఆర్ పై ఒత్తిడి చేయలేదన్నారు..

2016 లో ప్రారంభించిన కాలేశ్వరం, ఒక సంవత్సర కాలం 2017 లోనే ప్రాజెక్టు సంబంధించి డి.పి.ఆర్ తో పాటు





ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అనుమతులు తీసుకువచ్చి, బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ ను నిర్మించింది, నిర్మించిన కొద్ది రోజులకే ప్రాజెక్టు కూలిపోయిందని ఎద్దేవా చేశారు.

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్ ప్రారంభించింది 2015 లో, దాని డిపిఆర్ ను సెప్టెంబర్ 2022 నాడు సమర్పించింది, అట్టి డిపిఆర్ ను సెంట్రల్ వాటర్ కమిషన్ తిరస్కరించింది.

మూడేళ్లలో ప్రాజెక్ట్ పూర్తి చేస్తామన్న బిఆర్ఎస్ పాలకులు 7 ఏండ్ల అనంతరం డిపిఆర్ సమర్పించారు, ఇక్కడే అర్థం చేసుకోవచ్చు, జిల్లాకు చెందిన మంత్రుల, ఎమ్మెల్యేల అసమర్ధతను.

తిరిగి 90% పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి చేశామని, అవాస్తవాలకు తెర లేపారని విమర్శించారు.

33,500 కోట్ల రూపాయల అంచనాలతో పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు ను ప్రారంభించారు, 55,500 కోట్ల రూపాయల అంచనాలతో డిపిఆర్ సమర్పించారు.

డిపిఆర్ సమర్పించే నాటికి, ప్రాజెక్ట్ పై బిఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసింది 27 వేల కోట్లు మాత్రమే.

ప్రాజెక్ట్ పై 27 వేల కోట్లు ఖర్చు చేసి, 90 శాతం పనులు ఎలా పూర్తి చేశారో బిఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని సవాల్ చేశారు.

2023 అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ 11 రోజుల ముందు ఆఘామేఘాల మీద, ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, నార్లపూర్ వద్ద కెసిఆర్ ఒక మోటర్ ఆన్ చేస్తే, కేసీఆర్ తిరిగి పాలమూరు నుండి పట్నం వచ్చే లోపు మోటార్ ఆగిపోయింది.చరిత్రలో ఎక్కడ లేని విధంగా, మెయిన్ కెనాల్ లకు భూసేకరణ చేయకుండా ప్రాజెక్ట్ నిర్మాణాన్ని చేపట్టింది బిఆర్ఎస్ ప్రభుత్వం.పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి కాలువల నిర్మాణం కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఎకరా భూమి కూడా సేకరించలే.

బిఆర్ఎస్ ప్రభుత్వం 2015 సంవత్సరం లోనే కాలువలకు భూసేకరణ చేసి ఉంటే, తక్కువ ఖర్చులో భూసేకరణ జరిగి ఉండేది.ప్రస్తుతం పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయాలంటే 86000 వేల కోట్ల రూపాయల అంచనా ఉంది.

అయినా తమ ప్రభుత్వం వెనకడుగు వేయకుండా, ఎన్నోసార్లు ఇరిగేషన్ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి పాలమూరు రంగారెడ్డి పై రివ్యూ సమావేశాలు నిర్వహించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ప్రాజెక్టుపై 7,000 కోట్లు ఖర్చు చేశాం.

బిఆర్ఎస్ నాయకులు పాదయాత్ర చేస్తాం అనడం చూస్తుంటే, 1000 ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్లు అనిపిస్తుందని అభి వర్ణించారు.

ఆనాడు బిఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరును పడావు పెట్టి, యుద్ధ ప్రాతిపదికన కాళేశ్వరాన్ని పూర్తి చేస్తుంటే, పాలమూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మంత్రులు పాలమూరు - రంగా రెడ్డిని పూర్తి చేయమని కనీసం ఒత్తిడి చేసిన పాపాన పోలేదు.

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ పై, ముఖ్యమంత్రి పై బురద జల్లి అధికారంలోకి వస్తామని బిఆర్ఎస్ నాయకులు కలలు కంటున్నారు.

మీరు వచ్చేది లేదు, 2034 వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి ఉంటుంది.పాలమూరుకు ముఖ్యమంత్రి ఏం చేశారు అంటున్నారు... అడిగిందే తడువుగా పాలమూరు ముద్దుబిడ్డ రేవంత్ రెడ్డి , పాలమూరుకు ట్రిబుల్ ఐటీ, లా కాలేజ్, ఇంజనీరింగ్ కాలేజ్ ఇచ్చారు, అదేవిధంగా పాల మూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లు మంజూరు చేశారు. ముఖ్యమంత్రి విద్యా, వైద్యం, ఇరిగేషన్ లపై దృష్టి పెట్టి, జిల్లాకు అత్యధికంగా నిధులు కేటాయిం చారు. మీరు పాదయాత్ర చేసిన, పొర్లు దండాలు పెట్టిన మిమ్మల్ని ప్రజలు నమ్మే ప్రసక్తే లేదు.మీరు చేసిన మోసాలను ప్రజలు మర్చిపోలేదు, మొన్న జరిగిన గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల మీకు గుణపాఠం చెప్పారు, భవిష్యత్తులో కూడా మీకు గుణపాఠం తప్పదు.మేము మీలా పదేళ్లు అధికారంలో లేము, మేము అధికారంలోకి వచ్చి రెండు సంవ త్సరాల నాలుగు నెలలే అవుతుంది, అభివృద్ధికి అడ్డుపడకండి, అభివృద్ధికి సహకరిం చండి. పాలమూరు జిల్లాలో జరిగిన రైతు పండుగలో, మంత్రులందరి సమక్షంలోనే పాలమూరు జిల్లాకు సంవత్సరానికి 20వేల కోట్ల రూపాయలు కేటాయిస్తామని ముఖ్యమంత్రి ధైర్యంగా తెలియజేసి, ఆ దిశగా అడుగులు వేస్తూ, జిల్లా అభివృద్ధి కోసం పనిచేస్తున్నారు.జిల్లా ఎమ్మెల్యేలందరం వరి కొనుగోళ్ల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం, రెగ్యులర్ గా కొనుగోలులపై సమీక్షలు చేస్తూ, అధికారులకు ఆదేశాలిస్తూ రైతులకు అండగా ఉంటున్నాం. పాలమూరు అభివృద్ధికి, పాలమూరు ముద్దుబిడ్డ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి అహర్నిశలు కష్టపడుతుంటే, విమర్శించడం సరైనది కాదు, మీ పంథా మార్చుకోండి, పాలమూరు అభివృద్ధికి మీ సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామన్నారు.

## కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి): 2026-27 విద్యా సంవత్సరానికి కార్పొరేట్ ఇంటర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డి. సునీత తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 400 మార్కులకుపైగా సాధించిన పై వర్గాలకు చెందిన అర్హులైన విద్యార్థులు మే 20 నుంచి జూన్ 5 వరకు ఆన్‌లైన్ ద్వారా e-PASS వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఎంపికైన విద్యార్థుల వివరాలను జూన్ 10న e-PASS వెబ్‌సైట్‌లో ప్రకటిస్తామని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## ఐజ లో గురుకుల పాఠశాల ఏర్పాటు కోసం MRPS ఒత్తిడి మేరకు కదిలిన జిల్లా యంత్రాంగం!



అలంపూర్, (సమయం ప్రతినిధి) :ఐజ పట్టణ జోగులాంబ గద్వాల జిల్లా ఐజ పట్టణం లో గురుకుల పాఠశాల ఏర్పాటు కోసం.... MSP జిల్లా కన్వీనర్ MRPS జిల్లా మాజీ అధ్యక్షులు ఐజ రాజు మాదిగ గారు పలు మార్లు కలెక్టర్ దృష్టి కెల్లాడంతో..... జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులను బిల్డింగ్స్ పరిశీలించాలని ఆదేశించారు.... దీనితో ఈ రోజు రాజ కార్పొరేషన్ ED, RCO ఐజ పట్టణం కు వొచ్చి పలు బిల్డింగ్స్ రాఎవీ కాలేజీ,కాకతీయ స్కూల్, కర్నూల్ రోడ్డు న విఠలపురం చెందిన వ్యక్తి బిల్డింగ్స్ పరిశీలించడం జరిగింది, వీటిలో SVM కాలేజీ గురుకుల పాఠశాల కు అనుకూలంగా ఉన్నట్లు గా కలెక్టర్ దృష్టి కి తీసుకెళ్లు తామన్నారు, ఈ కార్యక్రమం లో BRS పట్టణ అధ్యక్షులు న్యాయా వాది మధు మాస్టర్, SC, St, & విజిలెన్స్ మా న టరింగ్ సభ్యులు మాల మల్లీ కార్జున్,MRPS గట్టు మండలం అధ్యక్షులు ఏసన్నమాదిగ కాంగ్రెస్ నాయకులు రఘు గౌడ్,BRS నాయకులు లెనిన్,కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వీరేష్,తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీపికి తాళం...

హైదరాబాద్ : తెలంగాణలో తెలుగుదేశం పార్టీని పూర్తిగా క్లోజ్ చేసినట్లే కనపడుతుంది. మహానాడు వంటి కార్యక్రమాల్లో మాత్రమే తెలంగాణ టీడీపీ నేతలు కనపడుతున్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అనధికారికంగా మూత వేసినట్లేనన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. మరోసారి ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి మళ్లీ రావడం టీడీపీ నాయకత్వం ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తుంది. 2024లో గెలిచిన తొలినాళ్లలో చంద్రబాబు హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు వచ్చి టీటీడీపీ నేతలతో సమావేశమై ఇక్కడ పార్టీని బలోపేతం చేస్తామని ప్రకటించారు.

## విపత్తులు వచ్చినప్పుడు వాటిని ఎదుర్కోవడానికి సంబంధిత శాఖలు సిద్ధంగా ఉండాలి

**విపత్తులు వచ్చినప్పుడు వాటిని ఎదుర్కొని, ప్రజల్ని రక్షించే చర్యల్లో భాగంగా, మే 18న మాక్‌డ్రిల్ నిర్వహించడానికి సంబంధిత శాఖలు ప్రణాళికా ప్రకారం సిద్ధమై, మాక్‌డ్రిల్ విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ ఆదేశించారు.**




వనపర్తి, సమయం ప్రతినిధి: శనివారం అదనపు కలెక్టర్ రెవెన్యూ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో మే 18న నిర్వహించనున్న మాక్‌డ్రిల్ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలి, ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై మాక్‌డ్రిల్ చేపట్టడంపై సమావేశంలో సమీక్షించి పలు సూచనలు చేశారు. జిల్లాలో మొత్తం ఏడు ప్రాంతాలను మాక్‌డ్రిల్ నిర్వహణకు గుర్తించినట్లు తెలిపారు. మాక్ డ్రిల్ చేసేందుకు 1. గద్ద బస్వాపూర్ గ్రామం, చిన్నంబావి మండలం, 2.జూరాల ప్రాజెక్ట్ ఎడమ కాలువ, అమర్చింత మండలం, 3.శంకరంపేట వాగు, మదనపూర్ మండలం, 4.భగీరథ కాలనీ, వనపర్తి 5. నల్లచెరువు, 6. మర్రికుంట 7.ప్రభుత్వ ఆసుపత్రి, వనపర్తి ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పూర్తి స్థాయి ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. మే 18న, ఉదయం 8 గంటల నుండి నిర్వహించే మాక్‌డ్రిల్ విజయవంతం కావడానికి ప్రతి శాఖ తగిన సన్నాహాలు చేసుకోవాలని, అవసరమైన పరికరాలు మరియు సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు ఇటువంటి మాక్‌డ్రిల్స్ ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సమావేశంలో డి సెక్షన్ సూపరింటెండెంట్ మదన్, డి వై ఎస్ ఓ సుధీర్ రెడ్డి, వీసీ ద్వారా సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేబినెట్ రీ లోడింగ్ టెన్షన్...

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి కళ్లు సచివాలయం వైపే ఉన్నాయి. ప్రభుత్వం కొలువుదీరి రెండున్నర ఏళ్లు పూర్తయిన తరుణంలో, ముఖ్యమంత్రి తన కేబినెట్‌ను ప్రక్షాళన చేసేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కేవలం ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా, పనితీరు ఆధారంగా మంత్రుల శాఖలను మార్చడం లేదా కొందరిని తప్పించడం వంటి కఠిన నిర్ణయాలు హైకమాండ్ తీసుకోబోతోందని తెలుస్తోంది. దీంతో రాష్ట్ర మంత్రుల్లో ఒకరకమైన అభద్రతా భావం, ఉత్కంఠ నెలకొన్నాయి.ప్రభుత్వ పనితీరును పరుగులు పెట్టించాలనే లక్ష్యంతో అధిష్టానం ఇప్పటికే మంత్రులందరి ప్రగతి నివేదికలను తెప్పించుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా కీలకమైన రెవెన్యూ, హోం, విద్యుత్ వంటి శాఖల పనితీరుపై మిశ్రమ స్పందన వస్తోంది. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తగ్గించడానికి, ఎన్నికల హామీల అమలులో వేగం పెంచడానికి సమర్థులైన వారికి కీలక బాధ్యతలు అప్పగించాలని సీఎం భావిస్తున్నారు. కొన్ని శాఖలు ఇప్పటికీ ముఖ్యమంత్రి వద్దే ఉండటం వల్ల పాలనాపరమైన జాప్యం జరుగుతోందన్న విమర్శలను చెరిపివేసేందుకు పూర్తి స్థాయి క్యాబినెట్ దిశగా అడుగులు పడుతున్నాయి.ఈ పునర్వ్యవస్థీకరణ వార్త సీనియర్ మంత్రులను కలవరపెడుతోంది. తాము గత 30 నెలలుగా ఒక శాఖపై పట్టు సాధించి, క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని గాడిలో పెట్టామని, ఇప్పుడు శాఖ మార్చితే మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తుందని కొందరు సీనియర్లు వాదిస్తున్నారు. తమ శాఖలను మార్చవద్దని ఇప్పటికే అధిష్టానానికి, ముఖ్యమంత్రికి మొరపెట్టుకున్నట్లు సమాచారం. మరోవైపు, ప్రస్తుతం ప్రాధాన్యత లేని శాఖల్లో ఉన్న మంత్రులు మాత్రం తమకు ఈసారైనా మెరుగైన బాధ్యతలు దక్కుతాయని ఆశగా ఉన్నారు. ముఖ్యంగాయాక్టివ్‌గా ఉంటూ పార్టీ వాయిస్‌ను బలంగా వినిపిస్తున్న వారికి ప్రమోషన్ దక్కే అవకాశం కనిపిస్తోంది.ఈ ప్రక్షాళనలో కేవలం పనితీరు మాత్రమే కాకుండా రాజకీయ, సామాజిక సమీకరణాలు కీలక పాత్ర పోషించనున్నాయి. ప్రస్తుతం ఉన్న ఖాళీలను భర్తీ చేసే క్రమంలో సామాజిక సమతుల్యతను పాటించాల్సి ఉంటుంది. ఏఐసిసి ఇచ్చే లీకులు, కార్యకర్తల ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే తుది జాబితా ఉంటుందని స్పష్టమవుతోంది. పనితీరు ఆశించిన స్థాయిలో లేని మంత్రులకు పదవీ గండం పొంచి ఉందనే ప్రచారం వారిలో నిద్రలేకుండా చేస్తోంది.మొత్తానికి తెలంగాణ కేబినెట్ విస్తరణ లేదా పునర్వ్యవస్థీకరణ అనేది కేవలం అడ్మినిస్ట్రేటివ్ మార్పు మాత్రమే కాదు, ఇది రాబోయే ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసే ఒక వ్యూహాత్మక చర్య. ఒకవైపు పదవులు ఊడతాయనే వణుకు, మరోవైపు కొత్త శాఖలు దక్కుతాయనే ఆశల మధ్య తెలంగాణ రాజకీయం.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్యం

**మంత్రి జూపల్లి కృష్ణారావు**
**డయాలసిస్ కేంద్రానికి నేటి నుంచి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా**
**ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి**





**నాగర్ కర్నూల్ ప్రతినిధి :** పేద, మధ్యతరగతి ప్రజలు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా, ప్రభుత్వ వైద్యశాలల్లోనే అన్ని రకాల వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. కొల్లాపూర్ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, రోగులకు అందుతున్న సేవలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. డయాలసిస్ రోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను పరిష్కరిస్తూ, ఆసుపత్రికి నేటి నుంచే 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాను అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రి ప్రకటించారు. ప్రజలు వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ దవాఖానాల్లోనే అన్ని వసతులు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. రూపాయి ఖర్చు లేకుండా ఆధునిక వైద్య సేవలు, పరీక్షలు, నాణ్యమైన మందులు ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొల్లాపూర్ ఏరియా ఆసుపత్రిలో త్వరలోనే పూర్తిస్థాయి సేవలను మరింత విస్తృతం చేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యుత్ అంతరాయం కారణంగా డయాలసిస్ రోగులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, వారి కోసం ప్రత్యేక విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేయించినట్లు మంత్రి వెల్లడించారు. నేటి నుంచి ఎలాంటి బ్రేక్ లేకుండా 24 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. దీనివల్ల రోగులకు సకాలంలో, సురక్షితంగా వైద్యం అందుతుందన్నారు. అలాగే డయాలసిస్ కేంద్రంలో అదనపు బెడ్లు, ఏసీల ఏర్పాటుతో పాటు రోగుల కోసం ప్రత్యేకంగా మరో అంబులెన్స్‌ను కూడా అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. గత 2018 సంవత్సరంలో రూ.22 కోట్ల వ్యయంతో మంజూరైన 100 పడకల నూతన ఆసుపత్రి భవన పనులు పూర్తయ్యాయని, త్వరలోనే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా చేతుల మీదుగా దీనిని ప్రారంభించనున్నట్లు జూపల్లి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే రోగుల సౌకర్యార్థం ఆసుపత్రి వద్ద రూ.5 లక్షల వ్యయంతో నూతన బస్ షెల్టర్ నిర్మిస్తున్నామని, స్థానిక ప్రజాప్రతినిధులు ఆసుపత్రిని నిరంతరం పర్యవేక్షిస్తూ రోగులకు అండగా ఉండాలని మంత్రి సూచించారు.

## వ్యక్తిగత భేదాలు పక్కన పెట్టి పార్టీ బలోపేతానికి ఐక్యంగా కృషి చేయాలి






మహబూబ్ నగర్ : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ విభాగం చైర్మన్‌గా నియమితులైన ఇర్ఫాన్ అలీ ఈరోజుమహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన సందర్భంగా జిల్లా మైనార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నుండి ఘన స్వాగతం పలికారు. ఇర్ఫాన్ అలీ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ బలోపేతం, మైనార్టీల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు.. అనంతరం డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ని వారి స్వగృహంలో కలిసి అనంతరం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ లౌకికవాదాన్ని కాపాడుతూ మైనారిటీల హక్కుల కోసం పోరాడిందని, సుదీర్ఘ అనుభవం ఉన్న ఇర్ఫాన్ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం వల్ల ఈ సంస్థ మరింత బలోపేతం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో ఉన్న ప్రస్తుత సున్నితమైన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మైనారిటీ విభాగాన్ని విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని, చిన్నచిన్న అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ వాటన్నింటినీ పక్కన పెట్టి నాయకులు, కార్యకర్తలు అందరూ పార్టీ బలోపేతం కోసం మక్తల్ జిల్లా తరఫున కొత్త నాయకత్వానికి పూర్తి మద్దతు ఇస్తూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. మైనారిటీ కార్పొరేషన్‌కు గత ఏడాది కేటాయించిన రూ. 3,500 కోట్ల బడ్జెట్‌లో ఇప్పటికే 73% నిధులను ఖర్చు చేశామని, కార్పొరేట్ స్థాయికి తగ్గకుండా 'ఏవీ=జు×ూ' స్కూల్స్ నడుస్తున్నాయని, అలాగే ఇమామ్ మరియు మౌజన్‌ల వేతనాలు ప్రతి నెల సక్రమంగా అందేలా 'గ్రీన్ ఛానల్' ఏర్పాటు చేసి భవిష్యత్తులో వేతనాలు పెంచే ఆలోచన కూడా చేస్తున్నామని వివరించారు. రంజాన్ తోఫా, హజ్ యాత్ర నిధులు, మైనారిటీ డిగ్రీ కాలేజీల మంజూరుతో పాటు రాబోయే జూన్ నుండి దాదాపు లక్ష మందికి లబ్ధి చేకూర్చే

### మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

సరికొత్త స్కీమ్స్, రాజీవ్ యువశక్తి నిధులు మరియు వితంతు పెన్షన్ల పరిశీలన కూడా ప్రారంభం కానుందని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మైనారిటీల పట్ల ఉన్న నిబద్ధత గతంలో ఏ ప్రభుత్వంలోనూ చూడలేదని, ప్రజలు ఎలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకు మద్దతు ఇచ్చి ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడుకోవాలని కొత్వాల్ కోరారు.ఇర్ఫాన్ అలీ మాట్లాడుతూ, త్వరలోనే మైనార్టీ విభాగానికి సంబంధించిన అన్ని కమిటీల నియామకాలు చేపడతామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని, మైనార్టీల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.అలాగే ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నేపథ్యంలో మైనార్టీల ఓట్లు తొలగించే ప్రమాదం ఉన్నందున ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని, ఒక్క ఓటు కూడా పోకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేసే నాయకులకు మాత్రమే ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు.ఎలాంటి సిఫార్సులు లేకుండా పార్టీ కోసం నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే వారికి మాత్రమే జిల్లా అధ్యక్ష పదవులతో పాటు ఇతర బాధ్యతల్లో అవకాశం కల్పిస్తామని తెలిపారు. అనంతరం పలువురు మైనార్టీ నాయకుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ , పిసిసి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ , హచ్ కమిటీ సభ్యుడు ముజీబ్,జిల్లా మైనార్టీ చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్లు, షబ్బీర్, ఉమెర్ కొత్వాల్, అవేజ్, జహీర్, మైనార్టీ విభాగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగు పాటు కు గురై మరణించిన తుప్పత్రాల వడ్డే నగేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి!

**తక్షణమే జిల్లా కలెక్టర్**
**MLA, MLC, SA సంపత్ కుమార్‌లు బాధితకుటుంబాన్ని పరామర్శించాలి!**
**వారి కుటుంబానికి 10 లక్షల ఎక్స్ గ్రేసియా చెల్లించాలి!**
**అర్హత కలిగి ఉంటే బాధితుడి భార్య కు అంగన్వాడీ టీచర్, లేక రేషన్ డీలర్ కేటాయించాలి!**



అలంపూర్ : జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీ పరిధిలో నీ తుప్పత్రాల గ్రామానికి చెందిన రైతు బిడ్డా వడ్డే నాగేష్..... తన పొలం లో పని చేస్తుండగా ఈ సాయంత్రం ఆకస్మాతుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో పిడుగు పడి మరణించడం దురదృష్ట కరం, బాధితుడి కి భార్య, చిన్న కూతురు, ప్రస్తుతం నాగేష్ భార్య గర్భిణీ,ఈ సమయం లో బర్త ను కోల్పోవడం తో కన్నీరు, మున్నీరై రోదించడం, తల్లీ దండ్రుల రోదన, ఆవేదన చూసిన గ్రామ ప్రజలు బావోద్వాగానికి గురైయ్యారు! దీనితో గ్రామం లో విషాద ఛాయలు కమ్ముకొన్నాయ్,కావున.... జిల్లా కలెక్టర్ ఇట్టి విషయం పై స్పందించి బాధిత కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేసియా చెల్లించడం తో పాటు, బాధితుడీ భార్య అర్హత కలిగి ఉంటే, అంగన్వాడీ ఉద్యోగం, లేదా డీలర్ షాప్ ను కేటాయించి బాధిత కుటుంబానికి ప్రభుత్వం భరోసా కల్పించాలి! ఇందుకు గాను మీూా, మీూా, అలాగే అధికార పార్టీ కాంగ్రెస్ అలంపూర్ ఇంచార్జి ూా సంపత్ కుమార్ లు తక్షణమే బాధిత కుటుంబాన్ని పరామర్శించి........ పై డిమాండ్స్ అందించే విదంగా కృషి చెయ్యాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## మే చివరి నాటికే నైరుతి రుతుపవనాల ఎంట్రీ

హైదరాబాద్ : తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ఐదు రోజులు ముందుగానే.. అంటే మే 26 నాటికే కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని ప్రకటించింది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇది మే 22 నుంచి 30 మధ్య మారవచ్చునని పేర్కొంది. ఈ లెక్కన తెలంగాణను జూన్ 1 లేదా 2వ తేదీల్లో రుతుపవనాలు పలకరించనున్నాయి.

## ఓటరు జాబితా పరిశీలన-ప్రత్యేక చర్యలు







**నాగర్ కర్నూల్ ప్రతినిధి :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా ఎన్నికల అధికారులు (ఐజూం), ఎన్నికల నమోదు అధికారులు (EROs)తో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్ శనివారం హైదరాబాద్‌లోని సీఈఓ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా (SIR) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం (ECI) త్వరలో ప్రకటించనున్నందున, మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి పురోగతి సాధించాలని కలెక్టర్లు, ఐజూం లను ఆయన ఆదేశించారు.
నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ హాజరై మాట్లాడుతూ, ......... జిల్లాలో ఇప్పటివరకు 75 శాతం మ్యాపింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓటరు జాబితాల పరిశీలన, బూత్‌ల వారీగా

### స్వచ్ఛమైన ఓటరు జాబితా పై జిల్లా యంత్రాంగం దృష్టి
### జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

వివరాల సేకరణ, సిబ్బంది సమన్వయం వంటి అంశాల్లో ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా స్థాయిలో చేపడుతున్న ఏర్పాట్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డికు వివరించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, సర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని, అందుకోసం వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ముఖ్యంగా బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై పార్టీలకు సూచనలు చేయనున్నట్లు, జిల్లాలో పెరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, సంబంధిత పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని అదనంగా ముగ్గురు సహాయ అధికారులను నియమించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ని కోరారు. అదనపు అధికారుల నియామకం ద్వారా మ్యాపింగ్, ఓటరు జాబితా పరిశీలన, ఫీల్డ్ స్థాయి పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి దశను కచ్చితంగా అమలు చేస్తూ, స్వచ్ఛమైన మరియు నిష్పాక్షిక ఓటర్ జాబితా రూపకల్పనకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఆర్డీవోలు సురేష్ బాబు, యాదగిరి, బన్సీలాల్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ

**రైతులకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు**
**రైతుల సమస్యలు తెలుసుకున్న జిల్లా కలెక్టర్**
**ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి**
**జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**



నాగర్ కర్నూల్ ప్రతినిధి : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని చందాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆకస్మికంగా సందర్శించి అక్కడి ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. రైతుల నుంచి కొనుగోలు జరుగుతున్న ధాన్యం నాణ్యత, తూకాల విధానం, రికార్డుల నిర్వహణ, నిల్వ సదుపాయాలు, హమాలి మరియు రవాణా ఏర్పాట్లపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయం తో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను తెలుసుకున్నారు. హమాలి కొరత, రవాణా ఆలస్యం వంటి సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయిలో సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..... రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి గింజకు సరైన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు వచ్చినప్పుడు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా త్వరితగతిన ధాన్యం స్వీకరణ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా తూకాల్లో ఎలాంటి లోపాలు లేకుండా ఖచ్చితత్వంతో వ్యవహరించాలని, రైతుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకత పాటించాలని సూచించారు. రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా ధాన్యం కొనుగోలు పూర్తైన వెంటనే సంబంధిత ప్రక్రియలు పూర్తి చేసి వారి బ్యాంకు ఖాతాల్లో త్వరితగతిన డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే కొనుగోలు కేంద్రంలో రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు, విశ్రాంతి ఏర్పాట్లు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని, పరిశీలన సందర్భంగా కొనుగోలు కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులను కూడా పరిశీలించి, అన్ని వివరాలు సక్రమంగా నమోదు చేయాలని, ధాన్యం నిల్వ విషయంలో నాణ్యత దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రవాణా ప్రక్రియ వేగవంతంగా ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ కళాభవన్ పనులను పరిశీలిన

**రూ.3 కోట్లతో నిర్మాణం.. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం**



నాగర్ కర్నూల్ ప్రతినిధి: సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'అంబేద్కర్ కళాభవన' నిర్మాణ పనులను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. శనివారం ఆయన నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించి, పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవన నమూనాను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా, నిర్దేశిత గడువులోగా నిర్మాణ పనుల న్నిం టినీ పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. స్థానిక కళాకారుల ప్రతిభా ప్రదర్శనలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ కళాభవనం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. పనుల్లో వేగం పెంచాలని, నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తుంపల్లిలో అక్రమ మట్టి తరలిస్తున్న సర్పంచ్




ఆత్మకూర్ : ఆత్మకూరు మండలం తుంపల్లి గ్రామంలో సర్పంచ్ భర్త భావని దామోదర్ రెడ్డి అక్రమంగా మట్టి తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 81 సర్వే నెంబర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సబ్ స్టేషన్ పనుల కొరకు మట్టిని చదును చేస్తున్న క్రమంలో మట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారని ఆరోపించారు. సొంత అవసరాల కోసం మైనింగ్ పర్మిషన్ లేకుండా మట్టి తరలింపు జరుగుతోందని చెప్పారు. అక్రమ మట్టి తరలింపుపై స్థానికులు ఎమ్మార్వో, ఎస్సై, సీఐకి ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల అక్రమాలు కొనసాగుతున్నాయని మండిపడుతున్నారు. సబ్ స్టేషన్ నిర్మాణ పనుల కోసం మట్టి చదును చేస్తున్న కాంట్రాక్టర్ అక్రమంగా తన సొంత అవసరాలకు సర్పంచ్ దామోదర్ రెడ్డి తరలిస్తున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు. స్థానికులు మాత్రం వెంటనే అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## పవన్ కు ఇన్ని ఆరోగ్య సమస్యలా

గుంటూరు : సైనస్ ఆపరేషన్ కారణంగా గత కొంత కాలం నుండి విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కళ్యాణ్ , నేడు తొలిసారి మీడియా ముందుకు వచ్చాడు. జనసేన పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం లో పాల్గొన్న ఆయన , నేడు మాట్లాడిన కొన్ని మాటలు ఇప్పుడు సోషల్ మీడియా అంతటా బాగా వైరల్ గా మారాయి. ముఖ్యంగా ఉద్యమి సభ్యత్వాలను అత్యధిక శాతం చేయించిన కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించాడు. ఇదంతా పక్కన పెడితే , తన ఆరోగ్య పరిస్థితి పై పవన్ కళ్యాణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు అభిమానులను కాస్త ఆందోళనకు గురి చేస్తోంది.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



నాగర్ కర్నూల్ ప్రతినిధి : నాగర్ కర్నూల్ జిల్లాలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు, డీఎంహెచ్వో పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శనివారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సమావేశంలో వివిధ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యాధికారులు, ఆరోగ్య శాఖ అధికారులతో సుదీర్ఘంగా చర్చించి ఆసుపత్రుల స్థితిగతులు ఆసుపత్రుల సేవలు స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలను తెలుసుకున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, అత్యవసర సేవలు, ప్రసూతి సేవలు, ప్రయోగశాల పరీక్షలు, పారిశుధ్య పరిస్థితులు తదితర అంశాలపై కలెక్టర్ క్షుణ్ణంగా ఆరా తీశారు. ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధి కారులను ఆదేశించారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు చేపట్టాలని సూచిం చారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందించే ఆరోగ్య సేవల్లో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలి పారు. అలాగే ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రోగుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరిం చాలని, ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని కూడా కలెక్టర్ సమీక్షించారు. ప్రజారోగ్య పరిరక్షణలో వైద్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆదేశించారు. నాగర్ కర్నూలు జిల్లా మెడికల్ కళాశాల వసతులు వైద్య ఆరోగ్యశాఖలో నిర్మిస్తున్న భవనాల స్థితిగతులపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ సమావేశంలో జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి, డిఎంహెచ్వో రవి నాయక్, వైద్య విధాన పరిషత్ వైద్యులు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయం**



సమయం ప్రతినిధి: ప్రజలకు అన్నివేళలా, అన్ని విధాలుగా ఆపద్బాంధవుడిగా నిలుస్తున్న సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఈ రోజు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పల్లేపహాడ్ గ్రామానికి చెందిన భూక్యా శ్రీనివాస్‌కు రూ. 36,000, బొమలరామారం గ్రామానికి చెందిన జూపల్లి మనమ్మకు రూ. 34,000 విలువైన చెక్కులను మల్లన్న వ్యక్తిగత సహాయకులు సుతారపు రంగన్న, భరద్వాజ్ లబ్ధిదారులకు అందజేశారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుని, వేగంగా చెక్కులు మంజూరు అయ్యేలా కృషి చేసిన మల్లన్న గారి సేవలను లబ్ధిదారులు హృదయపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రతినిధులు మాట్లాడుతూ– "ప్రజల కష్టాల్లో అండగా నిలబడటం మల్లన్న గారి ధ్యేయం అని,ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందించే సహాయం చేరేలా కృషి చేయడం మా బాధ్యతగా భావిస్తున్నాం" అని తెలిపారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ,వ్యక్తిగతంగా కాకుండా కూడా ప్రభుత్వం ద్వారా వచ్చే ఆర్థిక సహాయాన్ని వారికి తక్షణం అందించే నాయకుడిగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారు ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరుస్తున్నారు. అధికార యంత్రాంగాన్ని కదిలిస్తూ, అవసరమైన సహాయాన్ని సాధించడంలో ఆయన చూపిస్తున్న చొరవ ప్రజలలో ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెడుతోంది. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తామని మల్లన్న గారి కార్యాలయం వెల్లడించింది.

## గ్రేటర్ పై ధరల భారం..

హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరల పెంపుదల తెలంగాణ బీజేపీకి ఇబ్బందికరంగా మారనుంది. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఈసారి 300 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. గత ఎన్నికల్లో నలభైకి పైగా స్థానాలను గెలుచుకుంది. కానీ ఈసారి ఆ పరిస్థితి ఉండే అవకాశం లేదు. అయితే ఈ సమయంలో పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో ఈ ప్రభావం ఎన్నికలపై పడుతుందన్న ఆందోళన బీజేపీ నేతల్లో వ్యక్తమవుతుంది. లీటర్ పెట్రోలు, డీజిల్ పై 3.04 రూపాయలు పెరిగింది. హైదరాబాద్ లో పెట్రోలు లీటర్ పెట్రోలు ధర 110.88, లీటరు డీజిల్ ధర 98.96 రూపాయలకు చేరుకుంది. హైదరాబాద్ వంటి నగరాల్లో ఇది భారమనే చెప్పాలి. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ పెట్రోలు, డీజిల్ ధరల భారం పెనుమార్పులు తేనుంది. నిత్యావసరాల ధరలు పెరగడమే కాకుండా కూరగాయల ధరలు కూడా పెరిగే అవకాశముంది. దాదాపు అన్ని ధరలు పెరగనున్నాయి. బియ్యం నుంచి ఉప్ప వరకూ అన్ని ధరలు పెరిగితే అది సామాన్యుడి అసహనానికి కారణమవుతుంది. ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచారన్న అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. ఎన్ని పొదుపు సూత్రాలు, మంత్రాలు చెప్పినా ప్రజలకు తమ జేబుల్లో నుంచి డబ్బులు పోతే మాత్రం ఊరికే ఉండరు. తమ అసంతృప్తిని ఓటు రూపంలో ఖచ్చితంగా వెళ్లగక్కుతారన్న ఆందోళన కమలం పార్టీ నేతల్లో కనిపిస్తుంది. ఈ ధరలు పెరుగుదలతో బీజేపీ విజయానికి అడ్డుకట్ట వేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు వెళ్లే అవకాశాలున్నాయి. అర్ధరాత్రి ..నెల మధ్యలో పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడంతో పాటు గ్యాస్ సిలిండర్ ధర కూడా ఇటీవల అరవై రూపాయలు పెరగడంతో ఆ ప్రభావం తమ పార్టీపై పడుతుందేమోనన్న భయం బీజేపీ నేతలకు పట్టుకుంది. సాధారణంగా ప్రతి నెల ఒకటో తేదీన పెట్రో ఉత్పత్తుల ధరలను సమీక్ష చేసే చమురు సంస్థలు నెల మధ్యలోనే నిర్ణయం తీసుకుని జనంపై వీర బాదుడు చేశాయి.




**ఈ వేసవి సెలవుల్లో ఇంటిల్లిపాదీ ఆనందించేలా పుల్లటి మామిడికాయలతో రకరకాల శాకాహార, మాంసాహార వంటకాలు ప్రయత్నించవచ్చు. వాటిలో సులువుగా తయారుచేసుకోదగ్గ విభిన్న రుచులు మీకోసం...**

### ల్యాంబ్ మ్యాంగో కోకోనట్ కర్రీ

కావాల్సిన పదార్థాలు

ఫ మటన్ ముక్కలు- అర కేజీ, ఉల్లిపాయలు- 2, జీడిపప్పు పేస్టు- 2 చెంచాలు, టమాటా పేస్టు- 2 చెంచాలు, అల్లం వెల్లుల్లి పేస్టు- చెంచా, కారం- చెంచా, పసుపు- పావు చెంచా, గరం మసాలా పొడి- అర చెంచా, ఉప్పు- చెంచా, నూనె- 4 చెంచాలు, పచ్చిమామిడికాయ పేస్టు- అర కప్పు, కొబ్బరిపాల పొడి- 2 చెంచాలు, కొత్తిమీర తరుగు- కొద్దిగా

తయారీ విధానం

ఫ స్టవ్ మీద గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి అది వేడెక్కాక పసుపు, అల్లం వెల్లుల్లి పేస్టు, మటన్ ముక్కలు, ఉప్పు, కారం, గరం మసాలా పొడి వేసి బాగా కలపాలి. కొన్ని నీళ్లు చిలకరించి మూతపెట్టి మెత్తగా ఉడికించి పెట్టుకోవాలి. స్టవ్ మీద పాన్ పెట్టి రెండు చెంచాల నూనె వేసి అది వేడయ్యాక ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించాలి. తరువాత టమాటా పేస్టు, జీడిపప్పు పేస్టు, పచ్చి మామిడికాయ పేస్టు వేసి బాగా కలిపి అయిదు నిమిషాలపాటు వేగనివ్వాలి. తరువాత ముందుగా ఉడికించి పెట్టుకున్న మటన్ ముక్కలు, కొబ్బరిపాల పొడి వేసి కలపాలి. ఉప్పు సరిచూసుకోవాలి. చివరగా కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి.

### కైరీ పనీర్ టిక్కా

కావాల్సిన పదార్థాలు:

పనీర్ క్యూబ్స్- పావు కేజీ, కైరీ (పచ్చి మామిడికాయ పేస్టు)- అర కప్పు, గ్రీక్ యోగర్ట్ (చిక్కటి పెరుగు)- అర కప్పు, అల్లం వెల్లుల్లి పేస్టు- చెంచా, ఉల్లిపాయ- 1, క్యాప్సికమ్- 1, కశ్మీరీ కారం- చెంచా, పసుపు- పావు చెంచా, గరం మసాలా పొడి- చెంచా, జీలకర్ర పొడి- చెంచా, చాట్ మసాలా పొడి- చెంచా, కసూరీ మెంతి- చెంచా, ఉప్పు- తగినంత, శనగపిండి- 2 చెంచాలు

తయారీ విధానం:

ఉల్లిపాయ, క్యాప్సికమ్‌లను పెద్ద ముక్కలుగా కోయాలి. గిన్నెలో పెరుగు వేసి క్రీమ్‌లా వచ్చే వరకు బీట్ చేయాలి. ఆపైన అల్లం వెల్లుల్లి పేస్టు, పచ్చి మామిడికాయ పేస్టు, శనగపిండి, కారం, పసుపు, గరం మసాలా పొడి, జీలకర్ర పొడి, ఉప్పు, కసూరి మెంతి వేసి బాగా కలపాలి. తరువాత పనీర్ క్యూబ్స్, ఉల్లిపాయ ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు వేసి జాగ్రత్తగా కలిపి ఫ్రిజ్‌లో గంటసేపు ఉంచాలి. పొడవాటి పుల్లలను తీసుకుని వాటికి క్యాప్సికమ్, పనీర్, ఉల్లిపాయ ముక్కలను వరుసగా గుచ్చాలి. స్టవ్ మీద పాన్ లేదా గ్రిల్ పెట్టి కొద్దిగా నూనె రాసి వేడిచేయాలి. దానిమీద పనీర్, క్యాప్సికమ్ ముక్కలు గుచ్చిన పుల్లలు ఉంచి గుండ్రంగా తిప్పుతూ చిన్న మంట మీద అయిదు నిమిషాలపాటు గ్రిల్ చేయాలి. తరువాత పళ్లెంలోకి తీసి కొద్దిగా చాట్ మసాలా పొడి చల్లి పుదీనా చట్నీతో వేడి వేడిగా సర్వ్ చేయాలి.

### ఫిష్ ఫింగర్స్ విత్ మ్యాంగో సల్సా

కావాల్సిన పదార్థాలు

ఫ పొడవుగా కోసిన తెల్లటి చేప ముక్కలు- అర కేజీ, బ్రెడ్ పొడి- ఒక కప్పు, కార్న్‌ఫ్లోర్- అర కప్పు, మిరియాల పొడి- చెంచా, ఉప్పు- తగినంత, వెల్లుల్లి పొడి- చెంచా, పాప్రికా పొడి- చెంచా, కోడిగుడ్లు- 2, సన్నగా తరిగిన మామిడికాయ ముక్కలు- ఒక కప్పు, టమాటా- 1, ఉల్లిపాయ- 1, కొత్తిమీర తరుగు- పావు కప్పు, పచ్చి మిర్చి- 1, నిమ్మరసం- 2 చెంచాలు, నూనె- తగినంత, ఆలివ్ ఆయిల్- చెంచా, టమాటా కెచప్- 2 చెంచాలు

తయారీ విధానం

ఒక గిన్నెలో మామిడికాయ ముక్కలు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, సన్నగా తరిగిన టమాటా ముక్కలు, కొత్తిమీర తరుగు, ఆలివ్ ఆయిల్, నిమ్మరసం, తగినంత ఉప్పు, టమాటా కెచప్ వేసి బాగా కలిపి మ్యాంగో సల్సా తయారుచేసుకోవాలి. దీన్ని అరగంటసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి.

స్టవ్ మీద పాన్ పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఒక గిన్నెలో కోడి గుడ్డు సొనలు వేసి బాగా బీట్ చేయాలి. మరో గిన్నెలో కార్న్‌ఫ్లోర్, పాప్రికా పొడి, వెల్లుల్లి పొడి, మిరియాల పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి. చేప ముక్కలను ఈ మసాలా పొడిలో అద్ది తరువాత కోడిగుడ్డు సొనల్లో ముంచి ఆపైన బ్రెడ్ పొడిలో దొర్లించి వేడెక్కిన పాన్ మీద వేయాలి. చిన్న మంట మీద అన్ని వైపులా దోరగా వేగేలా షాలో ఫ్రై చేయాలి. తరువాత వీటిని పళ్లెంలోకి తీసి మ్యాంగో సల్సాతో సర్వ్ చేయాలి.

### ఖట్టా కా ముర్గ్

కావాల్సిన పదార్థాలు:

బోన్‌లెస్ చికెన్ లెగ్ పీస్‌లు- 6, పచ్చి మామిడికాయ పేస్టు- ఒకటిన్నర కప్పులు, నిమ్మరసం- 2 చెంచాలు, ఉప్పు- 3 చెంచాలు, అల్లం వెల్లుల్లి పేస్టు- 2 చెంచాలు, పెరుగు- అర కప్పు, జీడిపప్పు పేస్టు- పావు కప్పు, జీలకర్ర పొడి- 2 చెంచాలు, మెంతి పొడి- చెంచా, మిరియాల పొడి- 2 చెంచాలు, గరం మసాలా పొడి- 2 చెంచాలు, కారం- 2 చెంచాలు, కొత్తిమీర తరుగు- కొద్దిగా

తయారీ విధానం:

ఒక గిన్నెలో పెరుగు, జీడిపప్పు పేస్టు, జీలకర్ర పొడి, మెంతి పొడి, మిరియాల పొడి, గరం మసాలా పొడి, కారం వేసి బాగా కలపాలి. మరో గిన్నెలో చికెన్ లెగ్ పీస్‌లు, నిమ్మరసం, అల్లం వెల్లుల్లి పేస్టు, ఉప్పు, పచ్చి మామిడికాయ పేస్టు వేసి బాగా కలిపి అరగంటసేపు నాననివ్వాలి. తరువాత అందులో ముందుగా తయారుచేసి పెట్టుకున్న మసాలా మిశ్రమం వేసి కలిపి మూతపెట్టి పది నిమిషాలు ఉంచాలి. ఆపైన సన్నని పొడవాటి కడ్డీలను తీసుకుని వాటికి చికెన్ లెగ్ పీస్‌లు గుచ్చాలి. వీటిని తందూరీ కుండలో అమర్చి పావుగంటసేపు మగ్గించాలి. తరువాత పళ్లెంలోకి తీసుకుని కొద్దిగా కొత్తిమీర తరుగు చల్లి సర్వ్ చేయడమే.

## కార్పొరేషన్ చైర్మన్ అభినందించిన ఎమ్మెల్యేలు



హైదరాబాద్:తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మేకల అభివృద్ధి సహకార సమాఖ్య (TGSDGCFL) చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి కె. సరిత తిరుపతయ్యని , హైదరాబాద్ లోని వారి కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పదవీకాలంలో సంస్థ అభివృద్ధి, సంక్షేమానికి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ ఇంచార్జి



గద్వాల: జిల్లా కేంద్రంలోని పిల్లిగుండ్ల కాలనీ లో శ్రీ ముడుపుల ఆంజనేయ స్వామి దేవస్థానం నందు అమావాస్య సందర్భంగా 37 వ వార్డు కౌన్సిలర్ చిత్తరి మంజుల రాణి కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు... అంతక ముందు, లిబిశ్రీ అంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ఆశీస్సులను పొందారు.ఈ కార్యక్రమంలో కోటేష్,కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్,TNR జగదీష్,కమ్మరి సునీత రాము,గువ్వల గోపాల్,మోహన్ యాదవ్,బీచుపల్లి, మోనేష్,తిమ్మప్ప గౌడ్, శ్రీరాములు,పూడూరు రఘు నాయుడు, గొనుపాడు మాలిక్,ముని మౌర్య,గంగాధర్, రవి,నరసింహులు,శ్రీనివాసులు, ఆంజనేయులు,తిమ్మప్ప, వీరేష్, రాము, పార్టీ నాయకులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

## విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక క్రీడల్లో భాగస్వాములై రాణించాలి

### -అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్



వనపర్తి. సమయం ప్రతినిధి: ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా మే, 11 నుండి 17 వరకు నిర్వహిస్తున్న విద్యా వస్తోత్సవాల్లో భాగంగా శనివారం ఐ.డి. ఒ.సి సమావేశ మందిరంలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో కళలు, హస్తకళలు మరియు సాంస్కృతిక దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు వివిధ కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని రాణించాలని సూచించారు. విద్యార్థులు బాగా చదువుకుని తమ తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చడంతో పాటు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు బాగున్నాయని, అర్హులైన ఉత్తమ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనలు చేస్తున్నారని దానితోపాటు విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఇస్తున్నారని తెలియజేశారు. ప్రతి ఒక్కరు చదువుకోని విద్యావంతులు కావాలనేది ప్రభుత్వ ఆశయమని, చదువుకున్న వారు నిరక్షరాస్యుల కంటే చాలా గొప్పగా ఆలోచన విధానం ఉంటుందన్నారు. చదువుకున్న వారు ఒక్క యుద్యోగమే కాకుండా ఏ రంగంలోనైనా రాణించగలరని వివరించారు. అందుకే బడిబాట కార్యక్రమంలో ఏ ఒక్క పిల్లలు బడి బయట కాకుండా బడిలో చేరే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులు స్వయంగా రూపొందించిన చిత్ర కళలు, హస్త కళల ప్రదర్శనను అదనపు కలెక్టర్ సందర్శించి ఉత్తమ కళలు రూపొందించిన విద్యార్థులకు, చిత్రకళలు, నాట్యం చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.పీఎంశ్రీ పాఠశాల విద్యార్థినులు, ఇతర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, బాల భవన్ విద్యార్థులు నిరుపయోగ వస్తువులతో తయారు చేసిన హస్త కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి, భరత నాట్యం, ఫోక్ సాంగ్ పై చేసిన నృత్యాలు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. జిల్లా విద్యా శాఖ అధికారి మహమ్మద్ ఘని, యం. ఈ ఒ లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెట్రోల్ వినియోగం లో గోవా టాప్...

హైదరాబాద్ : అంతర్జాతీయి చమురు సంక్షోభం నేపథ్యంలో ఇంధన ధరల పెరుగుతున్నాయి. పీపీఏసీ 2024?25 డేటాను పరిశీలిస్తే మన దేశంలో ప్రతి 100 మందికి రోజుకు సగటున 10.4 లీటర్ల పెట్రోల్ వినియోగం జరుగుతోంది. గతేడాది లీటర్లుగా ఉండేది. కార్ల సంఖ్య పెరగడంతో వినయోగం పెరిగింది. అయితే రాష్ట్రాల మధ్య భారీ వ్యత్యాసం ఆర్థిక అసమానతలు ఉన్నాయి.పెట్రోల్ వినియోగంలో గోవా మొదటి స్థనంలో ఉంది. ఇక్కడ సగటున వారానికి ఒకరు 52 లీటర్ల పెట్రోల్ వినియోగిస్తాడు. ఇక్కడ 70 శాతం ఇంధన డిమాండ్ ఉంది.తర్వాత మరో మూడు రాష్ట్రాలు వరుసగా పుదుచ్చేరి, చండీగఢ్ 41 లీటర్లు, లద్దాక్ 37 లీటర్లు, అరుణాచల్ ప్రదేశ్ 27 లీటర్లు ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశ్ (21 లీటర్లు వినియోగిస్తుంది. తెలంగాణ 17 లీటర్లతక్ష 10వ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 11లీటర్ల వినియోగంతో 22వ రాష్ట్రంగా నిలిచింది.చిన్న రాష్ట్రాల్లో టూరిజం, ప్రైవేట్ వెహికల్స్ (పెట్రోల్ కార్లు 80 శాతం) వల్ల వినియోగం ఎక్కువ. తెలంగాణ?ఆంధ్రల్లో మిక్స్‌డ్ ఎకానమీ (2?వీలర్లు 70 శాత, పబ్లిక్ ట్రాన్స్ 20 శాతం) మధ్యస్థ స్థాయి. బిహార్ వంటివి గ్రామీణ ప్రాంతాలు, సైకిల్/బైక్ ఆధారిత రవాణా (పెట్రోల్ కార్లు 5 శాతం)తో తక్కువ. మొత్తం దేశ వినియోగం 3.5 కోట్ల లీటర్లు. ఆర్థిక, పర్యావరణ, పాలసీ ఒత్తిడి.. భారీగా పెట్రోలియం వినియోగంతో రూ.1.5 లక్షల కోట్ల చెల్లించాల్సి వస్తోంది.కాలుష్యం తగ్గించేందుకు పెట్రోల్‌లో 25 శాతం ఇథనాల్ కలపాలని కేంద్రం నిర్ణయించింది. హైకన్సూయమ్ రాష్ట్రాల్లో ఎయిర్ పొల్యూషన్ 30 శాతం ఎక్కువ. ధనిక రాష్ట్రాల్లో కార్ కల్చర్, పబ్లిక్ ట్రాన్స్ ఆధారం ఇది రీజనల్ డివైడ్‌ను పెంచుతోంది.ఒక వ్యక్తి సగటున వారానికి 10.4 లీటర్లు ఒక హెచ్చరికే. ఇంధన భద్రత, పర్యావరణ లక్ష్యాల దృష్ట్యా వినియోగం తగ్గించాలి. ప్రాంతీయ సమతుల్యతకు డ్రైవర్. ప్రభుత్వాలు రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగితే మనదేశం ఎనర్జీ?స్మార్ట్ నేషన్‌గా మారుతుంది.

# రైతులకు ఇబ్బందులు లేకుండా వేగంగా వరి కొనుగోళ్లు పూర్తి చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

## పోతులమడుగు, కొమిరెడ్డిపల్లి ఐకేపీ కేంద్రాల పరిశీలన -- రైస్ మిల్లులో అన్‌లోడింగ్ ప్రక్రియ తనిఖీ





**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శనివారం భూత్పూర్ మండలంలోని పోతులమడుగు ఐకేపీ వరి కొనుగోలు కేంద్రం, మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం తాటికొండ గ్రామంలోని నరహరి పారాబాయిల్డ్ రైస్ మిల్లును సందర్శించి వరి అన్‌లోడింగ్ ప్రక్రియను తనిఖీ చేశారు. ముందుగా పోతులమడుగు గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడిన కలెక్టర్, వరి కొనుగోళ్లలో ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లు ఐకేపీ సభ్యుల ద్వారానే జరుగుతున్నాయా లేక బయటి వ్యక్తుల ప్రమేయం ఉందా అనే అంశంపై ఆరా తీశారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో వి.ఓ.ఏ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

రైతులకు తాగునీరు, నీడ కోసం టెంట్లు, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశించిన కలెక్టర్, ధాన్యం కొనుగోలు అనంతరం రైతులకు వెంటనే కొనుగోలు రశీదు ఇవ్వాలని సూచించారు. రైతులు గన్నీ సంచులు, వరి రవాణాకు మరిన్ని లారీలు అవసరమని వివరించగా, వెంటనే వాటిని సమకూర్చాలని జిల్లా పౌర సరఫరాల అధికారి, సివిల్ సప్లైస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తదుపరి కొమిరెడ్డిపల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, రైతులతో మాట్లాడి వరి సకాలంలో కొనుగోలు అవుతోందా, చెల్లింపులు ఎన్ని రోజుల్లో ఖాతాల్లో జమ అవుతున్నాయో తెలుసుకున్నారు. వరి శుభ్రపరిచే విధానం, తేమ శాతాన్ని పరిశీలించారు. కేంద్రాల్లో ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేయడంతో పాటు తగిన సంఖ్యలో గన్నీ బస్తాలు, లారీలు అందుబాటులో ఉంచి లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రహదారుల వెంట ఉన్న వరి కుప్పలను ముందుగా కొనుగోలు చేసి ఐదు నుంచి ఆరు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొన్నారు. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని రక్షించేందుకు తగినన్ని టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులు కూడా వాతావరణ శాఖ హెచ్చరికలను గమనిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదనంగా ఆరు వేల గన్నీ సంచులు వెంటనే అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం తాటికొండ గ్రామంలోని నరహరి పారాబాయిల్డ్ రైస్ మిల్లును సందర్శించిన కలెక్టర్, లారీల నుంచి వరి బస్తాల అన్‌లోడింగ్ పనులను పరిశీలించారు. మిల్లర్లు మరిన్ని హమాలీలు, లారీలు ఏర్పాటు చేసి అన్‌లోడింగ్ వేగవంతం చేయాలని సూచించారు. ట్రక్ షీట్లను ఓపీఎంఎస్ యాప్‌లో వెంటనే అప్‌లోడ్ చేసి క్లియర్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మిల్లులో పనిచేస్తున్న హమాలీలతో మాట్లాడి వారి సంక్షేమ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, సివిల్ సప్లైస్ డీఎం రవి నాయక్, భూత్పూర్, మూసాపేట తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.







# ప్రాణాల మీదకు తెచ్చిన ప్రభుత్వాస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం



**సిద్దిపేట,(సమయం ప్రతినిధి):** సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం బయటపడింది. గత నెల(ఏప్రిల్) 14న రామాయంపేటకు చెందిన నందిని డెలివరీ కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. ఆపరేషన్ చేసిన తర్వాత బ్లీడింగ్ ఎక్కువ అవుతోందని డాక్టర్ సింధూరి కాటన్ పెట్టారు. అయితే కాటన్ తొలగించేందుకు మళ్లీ రావాల్సి ఉంటుందని పేషెంట్‌కు చెప్పడం మర్చిపోయారు డాక్టర్. దీంతో నెల రోజులుగా నందిని శరీరంలో కాటన్ అలాగే ఉండిపోవడంతో ఇన్ఫెక్షన్‌తో ఆమె అనారోగ్యానికి గురైంది. రోజు రోజుకు ఆరోగ్యం క్షీణిస్తుండటంతో నందిని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. దీంతో ప్రభుత్వ డాక్టర్ చేసిన నిర్వాకం బయటపడింది. ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఇన్ఫెక్షన్ వచ్చిందని ప్రైవేటు ఆస్పత్రి డాక్టర్ తేల్చి చెప్పారు. దీంతో నందిని కుటుంబసభ్యులు షాక్‌కు గురయ్యారు. వెంటనే సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి వెళ్లిన నందిని కుటుంబసభ్యులు, బంధువులు.. వైద్యుల నిర్లక్ష్యంపై నిలదీస్తూ ఆందోళనకు దిగారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల తీరుపై బాధితులు, పేషెంట్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.






OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085